




అభ్యర్థులు వీరే..
- రాయదుర్గంలో మార్పు లేదు.. కాలవే..!
- ఉరవకొండలో ఎప్పటిలాగే పయ్యావుల కేశవ్
- రాప్తాడు బరిలో మాజీ మంత్రి పరిటాల సునీత
- కళ్యాణదుర్గం బరిలో అమిలినేని సురేంద్రబాబు
- శింగనమలలో శ్రావణి.. తాడిపత్రిలో జేసీ అశ్మిత్



- పొత్తు నేపథ్యంలో రెండింట జాప్యం
- గుంతకల్లు, అనంత అర్బన్‌పై ఉత్కంఠ
- అనంత అర్బన్ ఆశిస్తున్న జనసేన పార్టీ
- గుంతకల్లులో గెలుపుగుర్రం కోసం అన్వేషణ

చంద్రన్న దూకుడు

6 స్థానాలకు అభ్యర్థులు ఖరారు

అనంతపురం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు జిల్లాలో ఏకంగా ఆరు నియోజకవర్గాలకు తొలివిడతలోనే అభ్యర్థులను ఖరారు చేశారు. అభ్యర్థుల ఖరారు విషయంలో మునుపటికి భిన్నంగా వ్యవహరించారు. గతంలో మాదిరిగా ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయిన తరువాత కాకుండా.. నోటిఫికేషన్ వెలువడకనే మెజార్టీ నియోజకవర్గాలకు అభ్యర్థులను ఖరారు చేశారు. దీంతో ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం ఉరకలేస్తోంది. టీడీపీ రేసు గుర్రాలు ఎవరో తేలిపోవడంతో క్షణం ఆగకుండా సంబరాలు మొదలు పెట్టారు.

ఆరుగురు ఖరారు

జిల్లాలో ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకుగానూ ఆరుచోట్ల అభ్యర్థులు ఖరారయ్యారు. అనంతపురం అర్బన్, గుంతకల్లు మినహా.. రాయదుర్గం, ఉరవకొండ, కళ్యాణదుర్గం, రాప్తాడు, తాడిపత్రి, శింగనమల నియోజకవర్గాల అభ్యర్థులను పార్టీ అధినేత శనివారం ప్రకటించారు. రాయదుర్గం నుంచి మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు, ఉరవకొండ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ పయ్యావుల కేశవ్, రాప్తాడు నుంచి మాజీ మంత్రి పరిటాల సునీత, తాడిపత్రి నుంచి నియోజకవర్గ ఇన్‌చార్జి జేసీ అస్మిత్‌రెడ్డి, శింగనమల నుంచి నియోజకవర్గ నాయకురాలు బండారు శ్రావణిశ్రీ అభ్యర్థిత్వం ఖరారైంది. కళ్యాణదుర్గం నుంచి ఎవరూ ఊహించని విధంగా ప్రముఖ వ్యాపారవేత్త, ఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత అమిలినేని సురేంద్రబాబును బరిలో నిలిపారు. టీడీపీ అధిష్టానం అంతర్గతంగా నిర్వహించిన సర్వేలు, సామాజికపరమైన అంశాలను దృష్టిలో ఉంచుకుని, అభ్యర్థులను ఎంపిక చేసినట్లు స్పష్టంగా అర్థమవుతోంది.

జనసేన కోసం జాప్యం

అనంతపురం అర్బన్, గుంతకల్లు నియోజకవర్గాల అభ్యర్థులు ఎవరో తొలిజాబితాలో ప్రకటించలేదు. దీంతో ఆ రెండింటిపై ఉత్కంఠ నెలకొంది. జనసేనతో పొత్తు నేపథ్యంలోనే ఆ రెండు నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించలేదని ఆ పార్టీ ముఖ్యులు అంటున్నారు. జిల్లాలో ఒక అసెంబ్లీ నియోజకవర్గాన్ని జనసేనకు కేటాయిస్తారనే ప్రచారం జోరుగా సాగుతోంది. మరో వారం రోజుల్లో స్పష్టత వస్తుందని అంటున్నారు. ఆ తరువాతే అనంతపురం అర్బన్, గుంతకల్లు నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటిస్తారని సమాచారం.

ఆశావహుల్లో ఉత్కంఠ..

అనంతపురం అర్బన్ నుంచి మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. అధిష్టానం ఆయన అభ్యర్థిత్వాన్ని పరిశీలిస్తోంది. పొత్తు నేపథ్యంలో జనసేనకు అనంతపురం అర్బన్ నియోజకవర్గాన్ని కేటాయిస్తారనే ప్రచారం జోరందుకుంది. జనసేనకు అనంతను కేటాయిస్తే.. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్, పార్టీ కార్యక్రమాల నిర్వహణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భవానీ రవికుమార్, రాయలసీమ మహిళా విభాగం కో-ఆర్డినేటర్ పెండ్యాల శ్రీలతలో ఒకరు బరిలో ఉంటారని భావిస్తున్నారు. తెలుగుదేశం పార్టీలో అనంతపురం అర్బన్ స్థానాన్ని మైనార్టీ నేత కేఎం జకీవుల్లా, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్ మొహిద్దీన్, పార్టీ సీనియర్ నాయకుడు గడ్డం సుబ్రహ్మణ్యం కుమారుడు ఎద్దుల లలిత్‌కృష్ణ, ఎన్ఆర్ఐ ఎద్దులపల్లి నిర్మల టికెట్ ఆశిస్తున్నారు. ఎవరికి వారు ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు. గుంతకల్లు అభ్యర్థి ఖరారు విషయంలోనూ టీడీపీ అధిష్టానం ఆచితూచి అడుగేస్తోంది. సామాజిక సమీకరణాలు, పార్టీ బలాన్ని బేరీజు వేస్తున్నారు. ఆ నియోజకవర్గం నుంచి ఎవరిని బరిలోకి దింపితే విజయావకాశాలు ఎక్కువగా ఉంటాయో గుర్తించడంపై అధిష్టానం దృష్టి సారించింది. ఆశావహులు టికెట్ దక్కించుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు.



● ఉరవకొండ అభ్యర్థిగా పయ్యావుల కేశవ్‌ను ప్రకటించడంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు క్లాక్ టవర్ వరకూ ర్యాలీ నిర్వహించారు. కవిత హోటల్ సర్కిల్‌లో బాణసంచా పేల్చి హర్షం వ్యక్తం చేశారు.

లక్కీ 9
ఉమ్మడి జిల్లాలో తొమ్మిది మంది అభ్యర్థుల ఖరారు
(వివరాలు 7లో..)



● అమిలినేని సురేంద్రబాబుకు టిక్కెట్ ఖరారు కావడంతో ఆయన వర్గీయులు కళ్యాణదుర్గం టి సర్కిల్, ఎన్టీఆర్ భవన్ వద్ద టపాసులు పేల్చి సంబరాలు చేసుకున్నారు.



● రాయదుర్గం అభ్యర్థిగా కాలవ శ్రీనివాసులు పేరును ప్రకటించడంతో బొమ్మనహాళ్ మండలం ఉద్దేహాళ్‌లో టీడీపీ శ్రేణులు టపాసులు పేల్చి సంబరాలు చేసుకున్నాయి.



● తాడిపత్రి అభ్యర్థిగా జేసీ అశ్మిత్ రెడ్డి పేరును ప్రకటించే సమయానికి ఆయన పట్టణంలో పర్యటిస్తున్నారు. అక్కడే కౌన్సిలర్లు ఆయనకు పుష్పగుచ్ఛాలను ఇచ్చి అభినందనలు తెలిపారు.



● రాప్తాడు అభ్యర్థిగా పరిటాల సునీత పేరు ప్రకటించగానే కనగానపల్లి మండలం మామిళ్లపల్లి సర్కిల్‌లో టీడీపీ నాయకులు బాణసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. పార్టీ అధినేత చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

165 స్థానాల్లో గెలుస్తాం : కాలవ



మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి కాలవ

రాయదుర్గం, ఫిబ్రవరి 24: తెలుగుదేశం-జనసేన కూటమి అసెంబ్లీ ఎన్నికల్లో 165 స్థానాల్లో గెలవబోతోందని టీడీపీ రాయదుర్గం అభ్యర్థి కాలవ శ్రీనివాసులు అన్నారు. పట్టణంలోని తన నివాసంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పార్టీని నమ్ముకున్న వారికి చంద్రబాబు వెన్నంటే నిలుస్తారనేందుకు తానే సాక్ష్యమని అన్నారు. తనకు రాయదుర్గం అభ్యర్థిగా అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. నిండు పున్నమినాడు తమ పార్టీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ కలిసి టీడీపీ, జనసేన అభ్యర్థుల తొలి జాబితాను విడుదల చేయడం చాలా సంతోషకరమని అన్నారు. ఈ శుభదినాన ప్రకటించిన జాబితాలో అభ్యర్థులందరం అప్రతిహత విజయాలను సాధిస్తామని అన్నారు. రాష్ట్రంలో టీడీపీ-జనసేన కూటమి ప్రభుత్వం రావాల్సిన చారిత్రక అవసరాన్ని ప్రజలు గుర్తించారని అన్నారు. ప్రజలు తమ కూటమికి ఏకపక్షంగా ఓటేసేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. సిద్ధం పేరుతో జగన్ నిర్వహిస్తున్న సభలు ఆరిపోయే దీపానికి వెలుగు ఎక్కువలాగా ఉన్నాయని అన్నారు. జగన్ ఓడిపోవడానికి సిద్ధమా..? పారిపోయేందుకు సిద్ధమా..? అని ప్రజలు అడుగుతున్నారని అన్నారు. జగన్ రాష్ట్రం వదిలి పారిపోయేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. తాము అధికారంలోకి వచ్చి, అభివృద్ధి చేయడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు.



● శింగనమల అభ్యర్థిగా బండారు శ్రావణి పేరు ప్రకటించడంతో అనంతపురం నగరంలోని ఆమె నివాసం వద్ద సందడి నెలకొంది. పార్టీ నాయకులు, కార్యకర్తలు రంగులు చల్లుకుంటూ సంబరాలు చేసుకున్నారు.



రథం లాగుతున్న భక్తులు

రంగనాథుడి వైభవం

కన్నుల పండువగా కల్యాణం.. రథోత్సవం

భక్తులతో కిటకిటలాడిన తొండపాడు క్షేత్రం




స్వామి వారికి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

గుత్తి రూరల్, ఫిబ్రవరి 24: బొలికొండ రంగనాథస్వామి రథోత్సవం, కల్యాణోత్సవం భక్తులను అలరించాయి. వేడుకల నేపథ్యంలో మండల పరిధిలోని తొండపాడు గ్రామం శనివారం భక్తులతో కిటకిటలాడింది. శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథస్వామి వారి కల్యాణాన్ని తెల్లవారుజామున ఘనంగా నిర్వహించారు. అనంతరం రుద్రపారాయణ హోమం నిర్వహించి, మహామంగళ హారతులిచ్చారు. ఆలయంలో స్వామివారికి అర్చకులు పంచామృతాభిషేకం నిర్వహించి, పుష్పాలతో అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి రథాన్ని వివిధ రకాల పూలతో విశేషంగా అలంకరించారు. శ్రీదేవి, భూదేవి సమేత బొలికొండ రంగనాథస్వామివారి ఉత్సవమూర్తులను రథంపై కొలువుదీర్చారు. ఈఓ దేవదాసు, ఆలయ ధర్మకర్త మాకం శ్రీకాంత్ టెంకాయ కొట్టి రథోత్సవాన్ని ప్రారంభించారు. భక్తులతో కలిసి రథాన్ని జమ్మిచెట్టు వరకు రథాన్ని లాగారు. భక్తులు రథంపైకి అరటి పండ్లు, బెల్లం, తీపి బెండ్లును విసిరి మొక్కు తీర్చుకున్నారు. గాజులు అంగళ్లు, లడ్డు, చెరకు అంగళ్లు భారీ ఎత్తున ఏర్పాటు చేశారు. గుత్తి, తాడిపత్రి డిపోల నుంచి తొండపాడుకి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. వేడుకలలో ఆలయ అర్చకులు రవిస్వామి, చేతన్‌వర్మ, లిఖిల్ వర్మ, నవీన్ ఉదయ్ పాల్గొన్నారు. సీఐలు వెంకట్రామిరెడ్డి, రాజశేఖర్ రెడ్డి, ఎస్ఐ నబీరసూల్ బందోబస్తు నిర్వహించారు.

ప్రత్యేక ఆకర్షణగా ఎద్దులబండ్లు

రథోత్సవం సందర్భంగా కర్నూలు జిల్లా ప్యాపిలి, మామిళ్లపల్లి, రాంపురం, జక్కసానికుంట్ల, నల్లమేకలపల్లి తదితర ప్రాంతాల నుంచి భక్తులు ఎద్దల బండ్లు, ట్రాక్టర్లలో వచ్చారు. స్వామివారి ఆలయం చుట్టూ వాటితో ప్రదక్షిణ చేశారు.

దివ్యరథంపై దేవదేవుడు



రథోత్సవం.. దేవరకొండపై అలంకరణలో కొండమీదరాయుడు స్వామి(ఇన్‌సెట్‌లో)

కన్నుల పండువగా కొండమీదరాయుడి రథోత్సవం

భక్తులతో కిటకిటలాడిన దేవరకొండ



సూర్యప్రభ వాహనంపై ఊరేగుతున్న స్వామివారు

బుక్కరాయసముద్రం, ఫిబ్రవరి 24: దివ్యరథంపై విహరిస్తూ దేవదేవుడు భక్తులను అలరించాడు. దేవేరులతో కలిసి సూర్యతేజ వాహనంపై విహరించారు. గోవింద నామస్మరణతో బుక్కరాయసముద్రం వీధులు మార్మోగాయి. దేవరకొండపై వెలిసిన కొండమీదరాయుడు స్వామివారి రథోత్సవం శనివారం అత్యంత వైభవంగా సాగింది. రాయలసీమ, కర్ణాటకలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. రథోత్సవానికి ముందు లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో భూదేవి, శ్రీదేవితో స్వామివారికి కల్యాణం జరిపించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను సూర్యప్రభ వాహనంపై ఊరేగించారు. వేద పండితులు రథం వద్ద హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను రథంపైకి చేర్చి పూజలు నిర్వహించారు. స్వామి వారి దివ్య రథానికి ఆలయ కమిటీ అధ్యక్షుడు శిరుగుప్ప శ్రీధర్‌బాబు కుటుంబ సభ్యులు గుమ్మడి కాయను కొట్టి, స్వామి వారికి ప్రధాన హారతి ఇచ్చారు. ఆ తరువాత భక్తులు రథాన్ని లాగారు. ఉదయం మడుగుతేరు, సాయంత్రం 4 గంటల రథోత్సవం నిర్వహించారు. దీంతో బ్రహోత్సవాల ప్రధాన ఘట్టం ముగిసింది.

- రథోత్సవం సందర్భంగా స్వామి పుట్టుశిల అయిన దేవరకొండ ప్రాంతం భక్తులతో కిటకిటలాడింది. కొండపైకి రోడ్డు వేయడంతో వాహనాలలో వేలాది మంది భక్తులు వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ అధ్వర్యంలో దేవరకొండ వద్ద భక్తులకు అన్నదానం చేశారు.
- రథోత్సవం సందర్భంగా దేవరకొండ వద్ద, మార్కెండేయ స్వామి దేవాలయం, ఆర్టీసీ బస్టాండ్, తహసీల్దార్ కార్యాలయం తదితర ప్రాంతాలలో భక్తులు అన్నదానం చేశారు.
- అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటశివారెడ్డి అధ్వర్యంలో ఇద్దరు సీఐలు, నలుగురు ఎస్ఐలు, 130 మంది పోలీసు సిబ్బంది, స్పెషల్ పార్టీ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.
- రథోత్సవం సందర్భంగా గాజులు, బొమ్మలు, మిఠాయిలు, చెరుకుల దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి.

రైతుల పట్టా భూములనే అమ్మేసిన ఘనులు


తెలుసుకుని అవాక్కైన రైతులు...
పోలీసులకు ఫిర్యాదు



చెన్నేకొత్తపల్లి, ఫిబ్రవరి 24: మండలంలోని న్యామద్దల రెవెన్యూకు సంబంధించి చెరువు ఆయకట్టుకింద పలువురు రైతులకు చెందినపట్టా భూములను వారికి తెలియకుండా ఓ ప్రైవేటు కంపెనీకి ఇద్దరు రియల్టర్లు అమ్మేసిన ఉదంతం ఆలస్యంగా వెలుగుచూసింది. చెన్నేకొత్తపల్లికి చెందిన ఎం.నారాయణస్వామి, బీసీ ముత్యాలుకు న్యామద్దల రెవెన్యూ పొలంలో సర్వేనెంబర్196-7ఏలో 1.33 ఎకరాలు, సర్వేనెంబర్ 196-7బీ లో అరెకరం కలిపి మొత్తం 1.83ఎకరాలు చెరువు ఆయకట్టు కింద ఉంది. పంట సాగుచేద్దామని వెళ్లి చూడగా తమ భూమికనిపించకపోవడంతో వారు అవాక్కయ్యారు. ఆరాతీస్తే ఆయకట్టు పరిసరాల్లో ఏర్పాటైన ఓ ప్రైవేటు కంపెనీకి తమ భూమిని అమ్మేసినట్టు గుర్తించారు. న్యామద్దల గ్రామంలోని ఇద్దరు వ్యక్తులకు ఆ భూమిని రికార్డుల్లో చూపించి వారి వద్ద నుంచి ఇరువురు రియల్టర్లు కొనుగోలు చేసినట్టు రిజిస్టర్ చేయించుకున్న తరువాత కంపెనీ వారికి అమ్మేసి సొమ్ము చేసుకున్నట్టు ఆ రైతులు తెలుసుకుని బిత్తరపోయారు. వెంటనే చెన్నేకొత్తపల్లి పోలీసులను ఆశ్రయించారు. న్యాయం చేయాలంటూ నారాయణప్ప, బీసీ ముత్యాలు ఎస్ఐ వెంకటేశ్వర్లు శనివారం లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా చెరువు ఆయకట్టుకింద ఉన్న దాదాపు 15 మంది రైతులకు సంబంధించి 20 ఎకరాలకు పైగా పట్టా భూములను అక్రమంగా అమ్ముకుని కోట్లలో సొమ్ము చేసుకున్నారని ఆ రియల్టర్లపై ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సమస్య నా దృష్టికి రాలేదు

చెరువు ఆయకట్టుకింద భూ అక్రమాలపై ఎలాంటి ఫిర్యాదు రాలేదు. బాధిత రైతులు ఫిర్యాదు చేస్తే విచారణ చేపడతాం.
- ఎస్‌కే హమీద్‌బాషా, తహసీల్దార్



లక్కీ నైన్..!

- టీడీపీ అధినేత చంద్రబాబు దూకుడు ● ఉమ్మడి జిల్లాలో తొమ్మిది మంది అభ్యర్థుల ఖరారు
- పెనుకొండ, కళ్యాణదుర్గం, మడకశిరకు కొత్తవారు ● రాప్తాడులో పరిటాల సునీత
- రాయదుర్గంలో కాలవ ● ఉరవకొండలో ఎప్పటిలాగే పయ్యావుల కేశవ్ ● శింగనమల బరిలో మరోమారు బండారు శ్రావణి ● పురంలో బాలయ్య.. తాడిపత్రిలో జేసీ అశ్మిత్

తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ఈసారి దూకుడు ప్రదర్శించారు. నామినేషన్ల చివరి రోజు వరకూ ఉత్కంఠ పెంచకుండా.. 'పోండి.. జనాన్ని గెలవండి..' అన్నట్లుగా అభ్యర్థులను ప్రకటించారు. ఉమ్మడి జిల్లాలో 14 నియోజకవర్గాలు ఉండగా.. ఒకే రోజు ఏకంగా తొమ్మిది స్థానాలకు రేసు గుర్రాలను ఖరారు చేశారు. ఇందులో ముగ్గురు కొత్తవారు కాగా, ఇద్దరు మాజీ మంత్రులు ఉన్నారు. ఉరవకొండలో పీఏసీ చైర్మన్, సిట్టింగ్ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్, హిందూపురంలో నందమూరి బాలకృష్ణ పేర్లను ప్రకటించారు. తాడిపత్రిలో జేసీ అశ్మిత్ రెడ్డి, శింగనమలలో బండారు శ్రావణిశ్రీకి రెండో చాన్స్ ఇచ్చారు. రాయదుర్గంలో ఎలాంటి సంచలనాలకు తావులేకుండా.. కాలవ శ్రీనివాసులుకు అవకాశం ఇచ్చారు. రాప్తాడుకు మాజీ మంత్రి పరిటాల సునీత పేరును ఖరారు చేశారు. కళ్యాణదుర్గంలో అమిలినేని సురేంద్ర బాబు, మడకశిరలో మాజీ ఎమ్మెల్యే ఈరన్న కుమారుడు డాక్టర్ సునీల్ కుమార్, పెనుకొండలో సవిత తొలిసారి ఎన్నికల బరిలో దిగుతున్నారు.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం.



ఉరవకొండలో కేశవ్ ఏడో సారి



తండ్రి వారసత్వంగా పయ్యావుల కేశవ్ రాజకీయాల్లో ప్రవేశించారు. 1994లో టీడీపీ అభ్యర్థిగా ఉరవకొండ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. తెలుగుదేశం పార్టీ బలమైన, ముఖ్యమైన నాయకుల్లో పయ్యావుల కేశవ్ ఒకరు. 1994 మొదలు ఇప్పటి వరకూ ఆయన ఉరవకొండ నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా ఆరుసార్లు పోటీ చేశారు. నాలుగు సార్లు గెలుపొందారు. ప్రస్తుతం ఏడో సారి కూడా టీడీపీ అభ్యర్థిగా బరిలో నిలవనున్నారు. ఎమ్మెల్సీగా పని చేశారు. పార్టీలో వివిధ స్థాయిల్లో పదవులు నిర్వహించారు. ప్రస్తుతం పీఏసీ చైర్మన్‌గా ఉన్నారు. వైసీపీలో నెలకొన్న వర్గ విభేదాలు ఈయన గెలుపునకు కలిసి వచ్చే అవకాశం ఉంది.

పయ్యావుల కేశవ్ ప్రొఫైల్

పేరు : పయ్యావుల కేశవ్
సామాజిక వర్గం : ఓసీ (కమ్మ)
తల్లిదండ్రులు : పయ్యావుల ఓబులమ్మ, పయ్యావుల వెంకటనారాయణ
విద్యార్హత : ఎంబీఏ, **భార్య** : పయ్యావుల హేమలత

పురం బరిలో బాలయ్య



దివంగత ఎన్టీఆర్ నట వారసత్వాన్నే కాకుండా రాజకీయ పంథాను పుణికి పుచ్చుకున్న నందమూరి బాలకృష్ణ 2014లో రాజకీయ ప్రవేశం చేశాడు. తన తండ్రి ప్రాతినిధ్యం వహించిన హిందూపురం అసెంబ్లీ స్థానం నుంచి 2014, 2019లో వరుసగా విజయాలు సాధించారు. 2024ల్లో కూడా టీడీపీ ఆయనను పురం బరిలో నిలిపింది. వచ్చే ఎన్నికల్లో కూడా విజయం సాధించి హ్యాట్రిక్ కొట్టాలని బాలయ్య అడుగులు వేస్తున్నారు.

నందమూరి బాలకృష్ణ ప్రొఫైల్

పేరు: నందమూరి బాలకృష్ణ
తల్లిదండ్రులు: నందమూరి తారక రామారావు, బసవతారకం
పుట్టిన తేదీ: 1960 జూన్ 10న చెన్నైలో జన్మించారు.
విద్యార్హత: హైదరాబాద్‌లోని నిజాం కాలేజీలో బీఏ చదివారు.
భార్య: 1982లో వసుంధరదేవితో వివాహం
సంతానం: బ్రాహ్మణి, తేజ, మోక్షజ్ఞ.
నివాసం: బంజారా హిల్స్, హైదరాబాద్
రాజకీయ రంగం ప్రవేశం: తెలుగు చలనచిత్ర రంగంలో అగ్రనటుడుగా, టీడీపీ వ్యవస్థపకుడు ఎన్టీఆర్ తనయుడుగా 2014లో హిందూపురంలో తొలిసారిగా ఎమ్మెల్యేగా పోటీ చేసి రాజకీయాల్లో వచ్చారు.

రాయదుర్గం కాలవకే ఖరారు



రాయదుర్గం అసెంబ్లీ స్థానానికి తెలుగు దేశం పార్టీ అభ్యర్థిగా కాలవ శ్రీనివాసులును మరోమారు పార్టీ అధిష్టానం ఖరారు చేసింది. 1999లో టీడీపీ తరపున ఎంపీగా గెలిచినప్పటి నుంచి ఆయన అదే పార్టీలో క్రియశీల రాజకీయాల్లో కొనసాగుతున్నారు. 2014లో రాయదుర్గం ఎమ్మెల్యేగా గెలిచి చీఫ్‌విప్, మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. 2019 ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత కూడా ప్రజా క్షేత్రంలో పార్టీ వాణిని బలంగా వినిపించారు. ప్రజా సమస్యలపై స్పందించడం, పార్టీకి విధేయులుగా ఉండటం వెరసి 2024 అసెంబ్లీ ఎన్నికల్లో రాయదుర్గం నియోజకవర్గం నుంచి మరోమారు పోటీ చేసే అవకాశం టీడీపీ కల్పించింది.

బయోడేటా :

పేరు : కాలవ శ్రీనివాసులు
తండ్రి పేరు : లేట్ బాల వెంకటస్వామి
తల్లి : కె. పుల్లమ్మ **జననం:** 01-06-1964
స్వగ్రామం : కే.కే. అగ్రహారం, బుక్కరాయసముద్రం మండలం
భార్య : కే. విజయలక్ష్మి
విద్యార్హత : ఎం.ఏ సోషియాలజీ, డిప్లొమా ఇన్ జర్నలిజం
అనుభవించిన పదవులు : తెలుగు దేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు, పార్లమెంట్ పార్టీ అధ్యక్షులు, 1999 - 2004 వరకు అనంతపురం ఎంపీ, 2014 నుంచి 2019 వరకు రాయదుర్గం ఎమ్మెల్యే, 2014 - 2017 చీఫ్ విప్, 2017-2019 వరకు మంత్రిగా కొనసాగారు.

కళ్యాణదుర్గం అభ్యర్థిగా అమిలినేని



రాజకీయ ప్రస్థానం: అమిలినేని సురేంద్రబాబు తెలుగుదేశం పార్టీ సానుభూతిపరుడిగా ఉంటూనే వ్యాపారం వైపు ప్రధానంగా దృష్టి సారించాడు. అంచెలంచెలుగా ఎదుగుతూ ఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీని ఏర్పాటు చేశాడు. 2014 ఎన్నికల్లో అనంతపురం అర్బన్ నియోజకవర్గం టీడీపీ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేశారు. మరి కొన్ని గంటల్లో నామినేషన్ వేయాల్సి ఉండగా... ఆయన స్థానంలో మరో అభ్యర్థిని ఖరారు చేశారు. దీంతో ఆ ఎన్నికల నుంచి తప్పుకున్న ఆయన తటస్థంగా కొనసాగుతూ వచ్చారు. క్రియాశీల రాజకీయాలు నెరపనప్పటికీ తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులతో సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తూ వస్తున్నారు.

సురేంద్రబాబు ప్రొఫైల్

పేరు : అమిలినేని సురేంద్రబాబు
తండ్రి పేరు : అమిలినేని వెంకటప్ప
తల్లి పేరు : అమిలినేని లక్ష్మీనరసమ్మ
పుట్టిన తేదీ : 22-5-1969 **స్వగ్రామం** : అమిద్యాల, ఉరవకొండ **విద్యార్హత** : బీకామ్ డిస్‌కంటిన్యూ
భార్య పేరు : అమిలినేని రమాదేవి

రాప్తాడు బరిలో మళ్లీ పరిటాల సునీత



రాజకీయ ప్రస్థానం : 2004లో ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత... అప్పటి టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి, పెనుకొండ ఎమ్మెల్యే అయిన పరిటాల రవీంద్రను ప్రత్యర్థులు 2005 జనవరిలో హత్య చేశారు. ఆయన మరణాంతరం 2005లో జరిగిన ఉప ఎన్నికల్లో పెనుకొండ నియోజకవర్గం నుంచి పరిటాల రవీంద్ర సతీమణి పరిటాల సునీత టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు. నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా 2009లో రాప్తాడు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందారు. 2014 ఎన్నికల్లోనూ అదే నియోజకవర్గం నుంచి పోటీచేసి మరోసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. టీడీపీ అధికారంలోకి రావడంతో చంద్రబాబు కేబినెట్‌లో పౌరసరఫరాలు, స్త్రీశిశుసంక్షేమ శాఖమంత్రిగా పనిచేశారు.

పరిటాల సునీత ప్రొఫైల్

పేరు : పరిటాల సునీత
తండ్రి పేరు : ధర్మవరపు కొండన్న
తల్లి పేరు : ధర్మవరపు సరస్వతమ్మ
భర్త పేరు : పరిటాల రవీంద్ర
పుట్టిన తేదీ : 28-5-1970
స్వగ్రామం : వెంకటాపురం, రామగిరి మండలం
విద్యార్హత : 10వ తరగతి

శింగనమలకు మరోసారి శ్రావణి



రాజకీయ ప్రస్థానం

బండారు శ్రావణీశ్రీ రాజకీయ ప్రస్థానం తెలుగుదేశం పార్టీలో 2015లో ప్రారంభమైంది. 2019లో శింగనమల నియోజక వర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా ఆమె పోటీ చేసి ఓడిపోయారు. అయినా కుంగిపోక జనం మధ్యే ఉంటూ నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి కృషి చేశారు. ఈ శ్రమే ఆమెకు 2024 అసెంబ్లీ ఎన్నికల్లో శింగనమల నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు అవకాశం కల్పించింది.

బండారు శ్రావణి ప్రొఫైల్

పేరు: బండారు శ్రావణిశ్రీ
తండ్రి: బండారు రవికుమార్, విశ్రాంతి ఇన్సూరెన్స్ మేనేజర్
తల్లి: బండారు లీలావతి **పుట్టినతేదీ:** 3-08-1990
స్వగ్రామం: బుక్కరాయసముద్రం మండలం సిద్దరాంపురం గ్రామం **విద్యార్హత:** మాస్ కమ్యూనికేషన్స్ ఇన్ జర్నలిజం

పెనుకొండ బరిలో సవిత



పెనుకొండ టీడీపీలో చురుకైన నాయకురాలిగా గుర్తింపు పొందారు సవిత. ఈమె తండ్రి దివంగత ఎస్. రామచంద్రారెడ్డి ఎమ్మెల్యేగా, ఎంపీగా, మంత్రిగా పని చేశారు. తండ్రి వారసత్వాన్ని పుణికి పుచ్చుకుని టీడీపీలో ఉంటూ ప్రజాసేవా కార్యక్రమాలను చురుగ్గా నిర్వహిస్తున్నారు. గత టీడీపీ హయాంలో రాష్ట్ర కురుబ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా పనిచేశారు. ఎస్ఆర్ఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్‌పర్సన్‌గా ఉంటూ పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఈమెది కురుబ సామాజిక వర్గం కాగా, భర్త కమ్మ సామాజిక వర్గానికి చెందిన వారు. దీంతో బీసీలతో పాటు కమ్మ సామాజిక వర్గం వారు కూడా సవిత గెలుపునకు సహకరిస్తారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

సవిత ప్రొఫైల్

పేరు: సవిత **కులం:** కురుబ
ఊరు: వజ్రాలపేట, పెనుకొండ పట్టణం, శ్రీసత్యసాయి జిల్లా.
భర్త : వెంకటేశ్వరరావు జననం: 15-01-1977
విద్యార్హత: బి.ఎ **వృత్తి:** వ్యాపారం, రాజకీయం

తాడిపత్రిలో జేసీ అశ్మిత్‌రెడ్డి



రాజకీయ ప్రస్థానం : తండ్రి జేసీ ప్రభాకర్‌రెడ్డి వారసత్వంతో జేసీ అశ్మిత్‌రెడ్డి 2014లో రాజకీయ రంగప్రవేశం చేశారు. తాడిపత్రి మున్సిపల్ ఎన్నికల్లో 2014లో 34వ వార్డు కౌన్సిలర్‌గా పోటీచేసి గెలుపొందారు. మొట్టమొదటిసారిగా 2019 ఎన్నికల్లో తాడిపత్రి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీచేసి ఓటమి చవిచూశారు.

పేరు : జూటూరు చిన్న అశ్మిత్‌రెడ్డి
తల్లిదండ్రులు : జేసీ ప్రభాకర్ రెడ్డి, జేసీ ఉమారెడ్డి **స్వస్థలం** : తాడిపత్రి
పుట్టిన తేదీ : 16-05-1983
భార్య పేరు : అఖిలా రెడ్డి
విద్యార్హత : చెన్నైలో మెకానికల్ ఇంజనీరింగ్, లండన్ ఆంధ్ర్యూస్ యూనివర్సిటీలో మాస్టర్స్ ఇన్ మార్కెటింగ్

తండ్రి బాటలో తనయుడు..



తండ్రి మద్దనకుంట ఈరన్న రాజకీయ వారసత్వానికి కొనసాగింపుగా డాక్టర్ సునీల్‌కుమార్ తెలుగు దేశం పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. తండ్రి గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయినా వెరవకుండా ప్రజల మధ్యే ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి టీడీపీ తరపున పోరాటం చేస్తున్నారు. ఈక్రమంలోనే పార్టీ అధిష్టానం ఆయన చొరవను గమనించి 2024 ఎన్నికల్లో మడకశిర(రిజర్వుడ్)అసెంబ్లీ స్థానం నుంచి టీడీపీ తరపున పోటీ చేసే అవకాశం కల్పించింది.

పేరు : డాక్టర్ సునీల్ కుమార్ **పుట్టినతేదీ** : 20-06-1991
భార్య : సారిక **గ్రామం** : మద్దనకుంట,
మండలం: అమరాపురం
నియోజకవర్గం : మడకశిర
తండ్రి : మద్దనకుంట ఈరన్న
తల్లి : శివమ్మ **విద్యార్హత** : బ్యాచ్‌లర్ ఆఫ్ డెంటల్

నేడే గ్రూప్-2 పరీక్ష

అనంతపురం టౌన్, ఫిబ్రవరి24 : ఏపీపీఎస్సీ నిర్వహిస్తున్న గ్రూప్-2 పోటీపరీక్ష ఆదివారం జరగనుంది. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపట్టినట్లు కలెక్టరు గౌతమి తెలిపారు. ఈపరీక్షలకు 32,391మంది అభ్యర్థులు హాజరవుతుండగా, జిల్లా వ్యాప్తంగా 111పరీక్షాకేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్ష నిర్వహణకు సీనియర్‌జిల్లా అధికారులు 38మందిని రూట్ ఆఫీసర్లుగా నియమించారు. 111మంది మండలస్థాయి అధికారులను లైజన్‌ఆఫీసర్లుగా నియమించారు. పరీక్ష ఉదయం 10-30గంటలనుంచి మధ్యాహ్నం 1-00గంటవరకు కొనసాగనుంది. నిమిషం ఆలస్యమైన పరీక్షకు అనుమతించమని కలెక్టరు వెల్లడించారు. అభ్యర్థులు ఉదయం9-30గంటల నుంచి 10గంటలలోపే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. 10-15గంటలవరకు కేంద్రాల్లోకి అనుమతిస్తారని, ఆతర్వాత నిమిషం ఆలస్యంగా వచ్చినా పరీక్షకేంద్రంలోకి అనుమతించేది లేదన్నారు. అభ్యర్థులు ఏదైనా గుర్తింపుకార్డుతో హాజరు కావాలన్నారు. ఎక్కడైనా ఏదెనా సమస్య వచ్చినా, అనుమానాలు నివృత్తి చేసుకోవాలన్నా కంట్రోల్‌రూమ్ 08554-220009 నెంబరుకు ఫోన్‌చేసి పరిష్కరించుకోవచ్చని కలెక్టరు సూచించారు.

అభ్యర్థులకు ప్రత్యేక బస్సులు

పుట్టపర్తి, ఫిబ్రవరి 24 : శ్రీ సత్యసాయి జిల్లాలో గ్రూపు-2 పరీక్షలు రాసేందుకు వెళ్లే అభ్యర్థులకు ఆయా సెంటర్లకు ఆదివారం ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు డీపీటీఓ మధుసూదన్ తెలిపారు. జిల్లాకేంద్రంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో 8839మంది అభ్యర్థులు గ్రూప్-2 పరీక్షలు రాయనున్నారని అన్నారు. ధర్మవరం, హిందూపురం, పెనుకొండ, క దిరి, మడకశిర ప్రాంతాల్లో పరీక్ష కేంద్రాలకు వెళ్లాల్సి ఉందన్నారు.

గుత్తి రైల్వే జంక్షన్‌కు మహర్దశ



గుత్తి, ఫిబ్రవరి24: గుత్తి రైల్వే జంక్షన్‌కు మహర్దశ కలగనుంది. జంక్షన్‌లో ప్రయాణికులు పడుతున్న కష్టాలను రైల్వే బోర్డు గుర్తించింది. దక్షిణ మధ్య రైల్వేలో 15 రైల్వేస్టేషన్లు 'అమృత్ భారత్' స్కీం కింద ఎంపికయ్యాయి. అందులో గుత్తి రైల్వే జంక్షన్ కూడా ఈనెల 26న అమృత్ భారత్ స్కీంను ప్రధాని నరేంద్ర మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. పథకంలో భాగంగా రూ. 10 కోట్లతో పలు అభి వృద్ధి పనులు చేపట్టనున్నట్లు సీనియర్ డివిజన్ ఇంజనీర్ సంజీవ్‌కుమార్, రైల్వేస్టేషన్ మేనేజరు సురేష్‌బాబు, ఐఓడబ్ల్యు అధికారి నాగేశ్వర నాయక్‌లు తెలిపారు. స్టేషన్ బుకింగ్ సూపర్‌వైజర్ శ్రీనివాసులు, వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్ మీనా కుమారి పరిశీలించారు.

గుంతకల్లు రైల్వే డివిజన్‌లోని 16 స్టేషన్ల అభివృద్ధికి కేంద్రం నిధులను కేటాయించింది. త్వరలో దేశవ్యాప్తంగా అమృత్ స్టేషన్లు, వంతెలన నిర్మాణానికి ప్రధాని నరేంద్రమోదీ శంకుస్థాపన చేయనున్నారని అధికారులు తెలిపారు. అందులో భాగంగా ద.మ. రైల్వే జోన్‌కు 1,800 కోట్లు లభించనుండగా, గుంతకల్లు రైల్వే డివిజన్‌లో 12 స్టేషన్ల అభివృద్ధికి, ఆర్‌ఓబీ, ఆర్‌యూబీల నిర్మాణానికి నిధుల కేటాయింపు జరిగినట్లు పేర్కొన్నారు. అనంతపురం రైల్వే స్టేషన్‌కు రూ.20.71 కోట్లు, గుత్తి స్టేషన్‌కు రూ.17.13 కోట్లు, తాడిపత్రి స్టేషన్‌కు రూ.7.68 కోట్లు, డివిజన్‌లోని ఆదోని స్టేషన్‌కు రూ.10.26 కోట్లు, కంభం స్టేషన్‌కు రూ.7.14 కోట్లు, డోన్ స్టేషన్‌కు రూ.13.13 కోట్లు, ధర్మవరం స్టేషన్‌కు రూ.8.64 కోట్లు, కడప స్టేషన్‌కు రూ.9.5 కోట్లు, మదనపల్లె రోడ్డు స్టేషన్‌కు రూ.8.01 కోట్లు, మంత్రాలయం రోడ్డు స్టేషన్‌కు రూ.3.58 కోట్లు, నడికుడి స్టేషన్‌కు రూ.11.3 కోట్లు, నంద్యాల స్టేషన్‌కు రూ.10.6 కోట్లు, పాకాల స్టేషన్‌కు రూ.7.28 కోట్లు, శ్రీకాళహస్తి స్టేషన్‌కు రూ.11.79 కోట్లు, రాజంపేట రైల్వే స్టేషన్‌కు రూ.5.93 కోట్లు, చిత్తూరు రైల్వే స్టేషన్‌కు రూ.13.99 కోట్లు కేటాయించారు.

శ్రీకృష్ణపై దాడి చేసిన వారిపై రౌడీషీట్ ఓపెన్ చేయాలి

- నిందితులను అరెస్ట్ చేయాలి ● బెస్త సేవా సంఘం నాయకుల డిమాండ్ ● కలెక్టరేట్ ఎదుట నిరసన దీక్ష

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 24 : సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటో గ్రాఫర్ బెస్త శ్రీ కృష్ణపై దాడి చేసిన వైసీపీ మూకలపై రౌడీషీట్ ఓపెన్ చేయాలని బెస్త సేవా సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం కలెక్టరేట్ ఎదుట బెస్త సేవా సంఘం ఆధ్వర్యంలో శ్రీ కృష్ణపై దాడికి వ్యతిరేకంగా నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా బెస్త సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ, గౌరవాధ్యక్షుడు చంద్రబాబు, ప్రధాన కార్యదర్శి బాస్కర్, బెస్త సేవా సమితి రాష్ట్ర డైరెక్టర్ చేపల హరిలు మాట్లాడుతూ.. సాక్షాత్తు సీఎం జగన్ సభలోనే ఆంధ్రజ్యోతి ఫొటో గ్రాఫర్‌పై వైసీపీ మూకలు విచక్షణా రహితంగా దాడి చేసి చంపేందుకు ప్రయత్నించడం దుర్మార్గమన్నారు. బీసీలపై వైసీపీ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఇదేనా అని ప్రశ్నించారు. దాడి జరిగి ఆరు రోజులు కావస్తున్నా ఇప్పటి దాకా ఒకరిని మాత్రమే అరెస్టు చేసి, మి గతా వారిని వదిలేయడం దారుణమన్నారు. దాడి చేసిన మూకలను పోలీసులు గుర్తించినప్పటికీ అధికార పార్టీ నేతల ఒత్తిడులతో అరెస్టు చేయకపోవడం దేనికి సంకేతమని నిలదీశారు. శ్రీకృష్ణపై దాడి చేసిన వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేయడం తోపాటు తక్షణమే అరెస్టు చేసి జైలుకు పంపాలని డిమాండ్ చేశారు.అనంతరం కలెక్టరేట్ ఏఓకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బెస్త సేవా సంఘం నాయకులు శీనా, నాగార్జున, కుళ్లాయప్ప, సుబ్బరాం ప్రసాద్, రమేష్, నారాయణస్వామి, బీసీ సంఘం రాయలసీమ యూత్ ప్రెసిడెంట్ జస్వంత్ వ్యాస్, నవీన్, వెంకీ, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఏఓకు వినతి పత్రం అందజేస్తూ..



కలెక్టరేట్ ఎదుట నిరసన దీక్షలో పాల్గొన్న బెస్త సేవా సంఘం నాయకులు

27న మహిళలకు ఉద్యోగమేళా

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 24: మొబైల్, ఎలక్ట్రానిక్ తయారీ సంస్థలో ఖాళీల భర్తీకి మహిళలకు ప్రత్యేక ఉద్యోగమేళా నిర్వహించనున్నారు. ఈనెల 27న నగరంలోని ఆర్డీటీ స్టేడియం ఎదురుగా ఉన్న ఏఎఫ్ ఎకాలజీ సెంటర్‌లో ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ మల్లారెడ్డి తెలిపారు. 18-26 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి, పదోతరగతి, ఇంటర్, డిగ్రీ చదివిన మహిళలు అర్హులన్నారు. కోలార్‌లోని ప్రముఖ మొబైల్ సంస్థలో నెలకు రూ.20వేల వేతనంతో పనిచేయాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి, అర్హతగల మహిళలు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు. వివరాలకు 9513822234ను సంప్రదించాలని కోరారు.

బైక్ రిపేరీలో ఉచిత శిక్షణ, ఉపాధి

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 24: టూవీలర్ మెకానిజమ్ బైక్ రిపేరీపై ఉచిత శిక్షణ, ఉపాధి కల్పిస్తామని ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి తెలిపారు. 18-35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి పదోతరగతి, ఇంటర్, ఐటీఐ చదివిన నిరుద్యోగ యువత అర్హులన్నారు. 45రోజుల పాటు శిక్షణలో ఇంగ్లీష్ నైపుణ్యం, కమ్యూనికేషన్ స్కిల్స్, వ్యక్తిత్వ వికాసంలో శిక్షణ ఇస్తామన్నారు. వివరాలకు సెల్ నంబర్లు 939050 5952, 7780752418లను సంప్రదించాలని కోరారు.

మార్పు రాకపోతే ఇంక్రిమెంట్స్ కట్ ...!

- సిబ్బందికి ఏపీ మోడల్ స్కూల్స్ జేడీ హెచ్చరిక



మాట్లాడుతున్న జేడీ వెంకట క్రిష్టారెడ్డి

అనంతపురం విద్య, ఫిబ్రవరి 24 : ఏపీ మోడల్ స్కూళ్లలో మార్పు కనిపించాలని, ఫలితాలు, అడ్మిషన్లు పెరగాలని, ఇదే తరహా నిర్లక్ష్యం ప్రదర్శిస్తే...ఇంక్రిమెంట్ కట్ చేస్తామని ఏపీ మోడల్ స్కూల్స్ జాయింట్ డైరెక్టర్ వెంకట కృష్ణారెడ్డి హెచ్చరించారు. శనివారం నగర శివారులోని ఆర్డీటీ ఆడిటోరియంలో ఉమ్మడి అనంతపురం, కర్నూలు జి ల్లాల ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాళ్లు, సబ్జెక్ట్ టీచర్లతో 10వ తరగతి, ఇంటర్ మీడియట్ గత ఏడాది ఫలితాలు, 2024 పరీక్షలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ వరలక్ష్మి, సీబీఎస్ఈ కోఆర్డినేటర్ శ్రీలత, ఏఎంఓ ధర్మకుమార్, అసిస్టెంట్ ఏఎంఓ శరత్ బాబు, మోడల్ స్కూల్ ఏడీలతో కలసి సమీక్ష చేశారు. అనంతపురం, సత్యసాయి, నంద్యాల, కర్నూలు జిల్లాల్లోని అన్ని మోడల్ స్కూళ్లలో విద్యార్థుల ఉత్తీర్ణతపై, తరగతులు, సబ్జెక్టుల వారీగా సమీక్షించారు. కొన్ని స్కూళ్లలో గత ఏడాది 10వ తరగతి, ఇంటర్‌లో దారుణమైన ఫలితాలు వచ్చాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రిన్సిపాళ్లు, టీచర్లు క్షేత్రస్థాయిలో తిరిగి అడ్మిషన్లు పెంచాలని, లేకపోతే స్కూళ్లు తొలగించే ప్రమాదం ఉందన్నారు. సొంత పిల్లల్లాగా భావించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ సిబ్బంది, నాలుగు జిల్లాల మోడల్ స్కూల్స్ ప్రిన్సిపాళ్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పప్పుశనగ విక్రయానికి పేర్లు నమోదు చేసుకోండి

- ఏపీ మార్క్‌ఫెడ్ డీఎం పెన్నేశ్వరి

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 24 : జిల్లాలోని రైతు భరోసా కేంద్రాల్లో సోమవారం నుంచి పప్పుశనగ విక్రయం కోసం రైతులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఏపీ మార్క్‌ఫెడ్ డీఎం పెన్నేశ్వరి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పప్పుశనగ క్వింటాల్ మద్దతు ధర రూ.5,440లుగా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

28న పీఎం కిసాన్, సున్నావడ్డీ డబ్బులు విడుదల

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 24: పీఎం కిసాన్, సున్నా వడ్డీ డబ్బులను ఈనెల 28న ప్రభుత్వం విడుదల చేయనున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని రైతులకు ఈ ఏడాదికి సంబంధించి మూడో విడత పీఎం కిసాన్ సొమ్ము, 2021-2022 రబీ, 2022-2023 ఖరీఫ్‌కు సంబంధించి సున్నా వడ్డీ డబ్బులను రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారన్నారు.



అభ్యర్థుల ప్రకటనతో సంబరాలు

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థులకు సంబంధించిన పేర్లను శనివారం చంద్రబాబునాయుడు ప్రకటించారు. రాప్తాడు, శింగనమల నియోజకవర్గాలకు పరిటాల సునీత, బండారు శ్రావణిశ్రీ పేర్లను ప్రకటించడంతో ఆయా ప్రాంతాల్లో నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. బాణాసంచాకాల్చి, స్వీట్లు పంచారు.



టపాసులు కాలుస్తున్న మాజీ జడ్పీటీసీ వేణుగోపాల్


ఆత్మకూరులో హర్షం వ్యక్తం చేస్తున్న నాయకులు, కార్యకర్తలు

అనంతపురంరూరల్: పరిటాల సునీత పేరును అధిష్ఠానం ప్రకటించడంతో పాపంపేటలో మాజీ జడ్పీటీసీ వేణుగోపాల్ ఇంటి వద్ద బాణసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సత్యసాయి జిల్లా మైనార్టీ సెల్ కార్యదర్శి బాబావలి, నాయకులు రత్నమోహన్, మౌలా, తెలుగు మహిళా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి లక్ష్మీదేవి, రంగమ్మ, తెలుగుయువత రాష్ట్ర అధికారప్రతినిధి హరీష్‌రెడ్డి, రమేష్, పాల్గొన్నారు.

ఆత్మకూరు: పరిటాల సునీత పేరును ప్రకటించడంతో పార్టీ కార్యాలయం ముందు బాణాసంచా కాల్చి కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ శ్రీనివాసులు, తెలుగుయువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణస్వామి, మాజీ వైస్ ఎంపీపీ ప్రతాప్, మాజీ కన్వీనర్లు వెంకటనారాయణ, నూరి, నాయకులు కందుల ఓబుళపతి, రవీంద్రారెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం అర్బన్/ గార్లదిన్నె: శింగనమల నియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా బండారు శ్రావణి శ్రీ పేరును ప్రకటించడంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సంబరాలు చేసుకున్నారు. శనివారం నగరంలోని ఆమె నివాసం వద్ద ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు రంగులు చల్లుకొని ఆనందాన్ని పంచుకున్నారు. గార్లదిన్నె, కల్లూరు తదితర గ్రామాల్లోని బాణసంచా కాల్చి స్వీట్లు పంచి సంబరాలు చేశారు. సంబరాల్లో గుత్తాహరి, రాజన్న, నాగేంద్ర, సామాల మధు, నలపరెడ్డి, భాషా, వలి తదితరులు పాల్గొన్నారు.

శింగనమల: బండారు శ్రావణిశ్రీకి ఖరారు కావడంతో ఆ పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. శింగనమలలోని ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్ వద్ద సంబరాలు చేశారు. పెరవలి గ్రామంలో టీడీపీ నాయకులు సంబరాలు చేశారు.


కల్లూరులో సంబరాలు


శింగనమలలో...

అమిలినేనిని కలిసిన నాయకులు


అమిలినేనికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

అనంతపురం ప్రెస్‌క్లబ్: కళ్యాణదుర్గం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా అమిలినేని సురేంద్రబాబుకు టికెట్ కేటాయించడంతో జనసేన పార్టీ సీనియర్ నాయకులు కాయగూరల లక్ష్మీపతి, కళ్యాణదుర్గం నియోజకవర్గ జనసేన నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. శనివారం ఆయన స్వగృహానికి జనసేన నాయకులు సంజీవరాయుడు, వెన్నెల కృష్ణ, మహేష్, లక్ష్మీనరసయ్య, కళ్యాణదుర్గం జనసేన నాయకులుదేవ, కార్తీక్, శంకర్, తేజ, మోహన్, కిశోర్ తదితరులు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

వనరులను సద్వినియోగం చేసుకోండి

● న్యాక్ కమిటీ సూచన

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 24: వనరులను సద్వినియోగం చేసుకోవాలని న్యాక్ కమిటీ సూచించింది. న్యాక్ కమిటీ మూడు రోజుల పర్యటన శనివారం ముగిసింది. ఈ సందర్భంగా డైరెక్టర్లు, కోఆర్డినేటర్‌లు, విభాగాధిపతులు, ప్రొఫెసర్‌లు, ఫ్యాకల్టీతో ఎగ్జిట్ మీటింగ్‌ను నిర్వహించారు. మౌలిక సదుపాయాలు, ల్యాబ్‌లు, అకడమిక్స్ బాగున్నాయని, రీసర్చ్ తక్కువగా ఉందన్నారు. పేటెంట్స్, స్టార్టప్స్, ఇంక్యుబేషన్ అంశాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. డాక్యుమెంటేషన్ సరిగాలేదని దీనిపై దృష్టిపెట్టాలన్నారు. అనంతరం వీసీ శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ శశిధర్ న్యాక్ కమిటీ సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ అరుణకాంతి, విభాగాధిపతులు కేఎఫ్ భారతీ, కళ్యాణిరాధ, మమత, అజిత, దిలీప్‌కుమార్, మారాల రామశేఖర్‌రెడ్డి, నారాయణరెడ్డితోపాటు బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో సూచనలు, సలహాలు ఇస్తున్న న్యాక్ కమిటీ సభ్యులు

వైసీపీ ప్రజావ్యతిరేక నిర్ణయాలను తిప్పికొట్టాలి

జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్


మాట్లాడుతున్న టీసీ వరుణ్

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 24: వైసీపీ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాలను తిప్పికొట్టాలని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్ పిలుపునిచ్చారు. శనివారం ఆయన 5వ రోడ్డులో పర్యటించి ప్రజలతో సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ జనసేన, టీడీపీ పార్టీలను గెలిపిస్తే ప్రజా ప్రభుత్వంలో అనంత నగరాన్ని ఆదర్శనగరంగా తీర్చిదిద్దుతానన్నారు. అధికారంలోకి రాకముందు నగరాన్ని అభివృద్ధి చేస్తానన్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఎమ్మెల్యే అయ్యాక నగరాభివృద్ధి నిగాలికొదిలేశారన్నారు. అనంతరం ఐదో రోడ్డులోని దర్గాలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు పొదిలి బాబురావు, సీనియర్ నాయకులు కాయగూరల లక్ష్మీపతి, మైనార్టీ నాయకులు నజీర్, జిల్లా ఉపాధ్యక్షుడు అం కె ఈశ్వరయ్య, జిల్లా ప్రధానకార్యదర్శి కుమ్మర నాగేంద్ర, జిల్లా కార్యదర్శులు సిద్దు, అ వుకు విజయ్‌కుమార్, నగర ప్రధాన కార్యదర్శులు మేదర వెంకటేష్, హుస్సేన్, దరాజ్ బాష, నగర కార్యదర్శులు లాల్‌స్వామి, కుమ్మరి మురళీ, అంజి, సంపత్, వెంకటరమణ, నాయకులు అశోక్, బాలన్న, రహీంబాష, డాలర్ మధు, లక్ష్మన్న, భూపతి, రమణ పాల్గొన్నారు.

పేదల బతుకు భారమవుతోంది: పెండ్యాల శ్రీలత

వైసీపీ హయాంలో పేదలు బతకలేని పరిస్థితులను ఎదుర్కొంటున్నారని జనసేన పార్టీ రాయలసీమ మహిళా విభాగం కో-ఆర్డినేటర్ పెండ్యాల శ్రీలత మండిపడ్డారు. శనివారం ఆమె మహిళలతో మాటామంతిలో భాగంగా 39వ డివిజన్‌లోని లక్ష్మీనగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాల వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జనసేన, టీడీపీలకు ఓటు వేసి రాష్ట్రాభివృద్ధికి దోహదపడాలని సూచించారు.

30 తులాల బంగారం చోరీ

గార్లదిన్నె, ఫిబ్రవరి 24: తాళం వేసిన ఇంట్లో చొరబడి సుమారు 30 తులాల బంగారు ఆభరణాలు, రూ. 50వేలు నగదు అపహరించారు. కల్లూరు గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డి పని నిమిత్తం హైదరాబాదుకు వెళ్లాడు. భార్య ఇంటికి తాళం వేసి వెనకాల ఉన్న జామతోటలో పని చేయిస్తోంది. దుండగులు ఇంటి తలుపులు పగులగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. బీరువా పగులగొట్టి 30 తులాల బంగారు ఆభరణాలు, రూ. 50వేలు నగదును అపహరించారు. సాయంత్రం ఆమె ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటి తలుపులు తెరచి ఉండడంతో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ గౌస్‌బాషా సంఘటనాస్థలానికి పరిశీలించారు. అనంతపురం డీఎస్పీ వెంకటశివారెడ్డి, శింగనమల సీఐ శ్రీధర్ సంఘటనా వివరాలు ఆరా తీశారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పోలీస్ పహారాలో శిలాఫలకం ఆవిష్కరణ

నార్పల, ఫిబ్రవరి 24: మండల కేంద్రంలోని కూతలేరు బ్రిడ్జి వద్ద శనివారం నూతన బ్రిడ్జి, మురుగు కాలువ పనుల కోసం ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి శిలాఫలకాన్ని ప్రారంభించారు. వైసీపీ నాయకులు సత్యనారాయణరెడ్డి, ఆయన అనుచరులు శిలాఫలకంలో ఎమ్మెల్యే తమ నాయకుడి పేరు లేకుండా చేశారని, పర్యటనను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈనేపథ్యంలో భారీ పోలీస్ బందోబస్తు నడుమ శిలాఫలకాన్ని ఆవిష్కరణ చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ రాజశేఖర్‌రెడ్డి బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆర్బీకే సిబ్బంది అంతర్ జిల్లాల బదిలీలు షురూ..!

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 24: రైతు భరోసా కేంద్రాల్లో పనిచేసే సిబ్బంది అంతర్‌జిల్లాల బదిలీలకు శ్రీకారం చుట్టారు. గత ఏడాది మేనెలలో జిల్లాలోని 16 మంది అంతర్‌జిల్లాల బదిలీల కోసం, మరో 29 మంది జిల్లాలోని ఇతర ప్రాంతాలకు బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్నారు. అప్పట్లో వారి బదిలీలకు బ్రేక్ పడింది. ఎట్టకేలకు తాజాగా 16 మంది అంతర్ జిల్లాల బదిలీ చేసేందుకు రాష్ట్ర ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 29వతేదీ అంతర్ జిల్లాల బదిలీ ఆర్డర్లు జారీ చేయనున్నట్లు సమాచారం. అయితే జిల్లా పరిధిలో బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్న సిబ్బందికి చుక్కెదురైంది. అంతర్ జిల్లాల బదిలీలతో పాటుజిల్లా పరిధిలో తమను బదిలీ చేయాలని ఆయా సిబ్బంది కోరుతున్నారు.

ఉపాధి పనులు కల్పిస్తాం: కలెక్టర్

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 24: కూలీలు వలస వెళ్లకుండా ఉపాధి పనులు కల్పిస్తామని ప్రభుత్వప్రధాన కార్యదర్శి(సీఎస్) జవహర్‌రెడ్డికి కలెక్టరు గౌతమి వివరించారు. శనివారం జిల్లా అధికారులతో పలు అంశాలపై వీడియోకాన్ఫరెన్స్ ద్వారా ఆరాతీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి పనులు కల్పించడానికి చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి, డీఎంహెచ్‌ఓ డాక్టర్‌ఈ బీ దేవి, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, డీసీహెచ్‌ఎస్ రవికుమార్ పాల్గొన్నారు.

చీనీ కాయలు టన్ను రూ.20వేలు

అనంతపురంరూరల్, ఫిబ్రవరి 24: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో శనివారం చీనీ కాయలు టన్ను గరిష్ఠంగా రూ.20వేలు, కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి రూ.15వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 106టన్నులు వచ్చాయన్నారు.

బాధ్యతల స్వీకరణ

చెన్నేకొత్తపల్లి, ఫిబ్రవరి 24: రామగిరి సీఐగా శివాంజినేయులు శనివారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ఆత్మకూరు: మండల పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐగా మునీర్ అహమ్మద్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి ఎలాంటి ఘర్షణలకు తావులేకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.


రామగిరి సీఐగా శివాంజినేయులు

భక్తిశ్రద్ధలతో మాఘ పూర్ణిమ

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 24: మాఘశుద్ధ పూర్ణిమను పురస్కరించుకుని శనివారం నగరంలోని పలు ఆలయాల్లో వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మూడవ రోడ్డులోని షిర్డిసాయిబాబా దేవాలయంలో వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ సాయిసత్య వ్రతాలను నిర్వహించారు. హెచ్చెల్సీ కాలనీలోని మంజునాథ స్వామి దేవాలయంలో అనంత ఐశ్వర్యేశ్వరస్వామి వ్రతాన్ని కనులపండువగా నిర్వహించారు. బెంగుళూరు రోడ్డులోని శివకోటి దేవాలయం, రామచంద్రనగర్ షిర్డిసాయిబాబా ఆలయం, అశోక్‌నగర్ సత్యనారాయణస్వామి ఆలయం తదితర ఆలయాల్లోనూ సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలను నిర్వహించారు.

ఖాజావలి ఆశయాలను కొనసాగిస్తాం: సీపీఎం

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 24: సీపీఎం నాయకుడిగా ఖాజావలి ప్రజల కోసం చేసిన పోరాటాలు, సేవలు మరవలేనివని, ఆయన ఆశయాలను కొనసాగిస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ పేర్కొన్నారు. ఖాజావలి 9వ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో ఖాజావలి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం రాంభూపాల్ మాట్లాడుతూ ఖాజావలి పోరాటాలు నేటికీ ప్రజల మనస్సుల్లో చిరస్థాయిగా నిలిచాయన్నారు. కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి, ప్రకాష్, వలి, జీవ, ప్రసాద్ పాల్గొన్నారు.

'అక్రమ కేసులు ఎత్తివేయాలి'

అనంతపురం విద్య/సెంట్రల్, ఫిబ్రవరి 24: సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ నాయకులు, బీహార్ శాసనసభ దళిత ఎమ్మెల్యే మనోజ్‌కుమార్ మంజిల్, మరో 22 మందిపై ఉన్న కేసులు ఎత్తివేయాలని ఆ పార్టీ నాయకులు, ఏఐఎస్‌ఏ, ఏజీసీసీటీయూ, ఆర్‌వైఏ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఆయా సంఘాల నాయకులు నగరంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఏ నాయకులు అబ్దుల్ ఆలం మాట్లాడుతూ రాజకీయ ప్రత్యర్థుల కుట్రలో భాగంగా హత్యకేసులో ఇరికించారన్నారు. విద్యార్థి, రాజకీయ నాయకుడిగా అనేక పోరాటాలు చేశారన్నారు. వెంటనే కేసులు ఎత్తివేయాలని కోరారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు ప్రతిభా భారతి, షామీర్ బాష, సుమాంజలి, మహబూబ్ ఆలీ, బాలరాజు, అబ్దుల్లా, హాజీవలి, సాయి, నరసింహ, అనిల్, వినయ్ పాల్గొన్నారు.

ఏపీఎల్‌లో పలు జట్లు విజయం

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 24: ఏపీఎల్‌లో పలు జట్లు విజయం సాధించాయి. శనివారం స్థానిక ఆర్డీటీ స్టేడియంలో కళ్యాణదుర్గం, పెనుకొండ జట్లు తలపడగా కళ్యాణదుర్గం గెలుపొందింది. మరో మ్యాచ్‌లో క్రికెట్ లవర్స్, జీఎంసీపీ జట్లు మధ్య జరగగా జీఎంసీపీ విజయం సాధించింది. ఐటీసీ గుంతకల్లు, హిందూపురం క్రికెట్ జట్లు పోటీపడగా హిందూపురం జట్టు గెలుపొందింది. కార్యక్రమంలో క్రికెట్ సంఘం జిల్లా కార్యదర్శి మధు ఆచారి, కోచ్‌లు కుమార్, మహేశ్వర్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

శింగనమల తమ్ముళ్ల నిరసన

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 24: ద్విసభ్య కమిటీ సభ్యులు చెప్పినవారికే శింగనమల టిక్కెట్ ఇవ్వాలని గార్లదిన్నె మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు డిమాండ్ చేశారు. బండారు శ్రావణిశ్రీని అభ్యర్థిగా ప్రకటించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ జిల్లా కార్యాలయం వద్ద శనివారం నిరసన తెలిపారు. కొందరు ఆగ్రహంతో పార్టీ కార్యాలయ కిటికీ అద్దాలు పగులగొట్టారు. ఫ్లెక్సీలను తొలగించారు. పోలీసులు అప్రమత్తమై వారిని అక్కడి నుంచి పంపించేశారు.

'దాడిచేసిన వారిపై రౌడీషీట్ ఓపెన్ చేయాలి'

శింగనమల, ఫిబ్రవరి 24: ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫోటోగ్రాఫర్ బెస్త శ్రీకృష్ణపై వైసీపీ అల్లరిమూకలు దాడి చేసిన నేపథ్యంలో వారిపై రౌడీషీట్ ఓపెన్ చేయాలని శింగనమల మండల బెస్త సంఘం అధ్యక్షుడు కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. శనివారం కృష్ణమూర్తి విలేకరులతో మాట్లాడుతూ నీతి నిజాయితీతో వైసీపీపై వార్తలు రాస్తున్నారని ఆంధ్రజ్యోతిని టార్గెట్ చేసి వైసీపీ దాడులు చేస్తున్నారన్నారు. సీఎం సభలోనే బెస్త కులానికి చెందిన ఫోటోగ్రాఫర్‌ను దాడి చేయడం దారుణమన్నారు. శ్రీకృష్ణపై దాడి చేసిన వారిని గుర్తించి వారిపై రౌడీషీట్ ఓపెన్‌చేసి కఠినంగా శిక్షించాలని, లేనిపక్షంలో పోరాటం చేస్తామన్నారు.

ఆరోగ్యవంతమైన జీవనాన్ని అలవర్చుకోవాలి: ఎస్కేయూ రిజిస్ట్రార్

అనంతపురం సెంట్రల్/రూరల్, ఫిబ్రవరి 24: ఆరోగ్యవంతమైన జీవనాన్ని అలవర్చుకోవాలని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మయ్య సూచించారు. శనివారం ఎస్కేయూ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఆకుతోటపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రజలు ఆరోగ్యంపై నిత్యం శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మురళీధరరావు, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ సోమశేఖర్, ఎన్ఎస్ఎస్ పీఓ సత్య సౌమ్య, డాక్టర్లు చైతన్య, గౌరీ శంకర్ పాల్గొన్నారు.

'ప్రజాస్వామ్యానికి వెన్నెముక న్యాయవ్యవస్థ'

అనంతపురం సెంట్రల్: న్యాయవ్యవస్థ ప్రజాస్వామ్యానికి వెన్నెముక అని న్యాచురల్ జస్టిస్ లీగల్ ఎయిడెడ్ సంస్థ అధ్యక్షుడు రామకృష్ణ అన్నారు. శనివారం శ్రీచైతన్య డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి అధ్యక్షతన అవగాహన సదస్సును నిర్వహించారు. సదస్సుకు రామకృష్ణతోపాటు లీగల్ స్టూడెంట్ సెల్ ఎస్ఎస్ బాషా, ఉమెన్‌సెల్ లక్ష్మీనరిత ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా సాధికారత సాధించేలా రాజ్యాంగం హక్కులను కల్పించిందన్నారు. న్యాయ విద్య నభ్యసించిన అనేకమంది మహిళలు ఉన్నతశిఖరాలను అధిరోహించి స్ఫూర్తిగా నిలిచారన్నారు. కార్యక్రమంలో సభ్యులు యాస్సిన్, జాహ్నవి, రమేష్, అంజనీపుత్ర, ఆది, మధు, సర్వరాజ్, సందీప్, దేవేంద్ర పాల్గొన్నారు.

'మూఢనమ్మకాలు వీడాలి'

అనంతపురం సెంట్రల్: మూఢనమ్మకాలు వీడాలని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ దివాకర్‌రెడ్డి సూచించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక శిబిరాన్ని శనివారం ఆయన సందర్శించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ సమాజంలోని రుగ్మతులు, మూఢనమ్మకాలపై ప్రజలను చైతన్యపరచాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు సుధాకర్, సోమశేఖర్, హెడ్‌మాస్టర్ లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండండి: ఎస్పీ


సూచనలు, సలహాలు ఇస్తున్న ఎస్పీ

ఆత్మకూరు ఫిబ్రవరి 24: సమస్యాత్మక గ్రామాల్లో అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ అన్బురాజన్ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. మండల పరిధిలోని సమస్యాత్మక గ్రామాలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల వేళ అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్

టీడీపీ హయాంలోనే క్రైస్తవులకు న్యాయం: స్వామిదాస్



మాట్లాడుతున్న ఈటె స్వామిదాస్

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 24: తెలుగుదేశం పార్టీ హయాంలోనే రాష్ట్రంలోని క్రైస్తవ మైనార్టీలకు న్యాయం జరిగిందని టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఈటె స్వామిదాస్ అన్నారు. శనివారం హౌసింగ్ బోర్డులోని బెరాక చర్చిలో నిర్వహించిన దైవసేవకుల రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రవ్యాప్తంగా పాస్టర్లు, క్రైస్తవులపై దాడులు జరుగుతున్నా ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. రానున్న ఎన్నికల్లో నారా చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిగా గెలిపించుకుంటేనే క్రైస్తవులకు మంచిరోజులొస్తాయని తెలిపారు. కార్యక్రమంలో బిషప్ శామ్యూల్ శ్రీనివాస్, రెవరెండ్ డాక్టర్ కృపాదాసు, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి హాజరైన పాస్టర్లు పాల్గొన్నారు.

'అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం'


కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎల్ నారాయణచౌదరి

రామగిరి, ఫిబ్రవరి 24: అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని సీనియర్ నాయకుడు ఎల్ నారాయణచౌదరి అన్నారు. శనివారం మండలంలోని గరిమేకలపల్లి గ్రామంలో బాబుష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీపై ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. అనంతరంఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక ఆక్రమణలు, దౌర్జన్యాలు పెరిగిపోయాయన్నారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబును సీఎంగా చేసుకుందామని, పరిటాల సునీతను ఎమ్మెల్యేగా గెలుపించుకోవడానికి సమష్టిగా కృషి చేద్దామన్నారు. కార్యక్రమంలో టీడీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు కుంటిమద్దిరంగయ్య, నాయకులు రామ్మూర్తినాయుడు, టీడీపీ మండల ప్రధానకార్యదర్శి మారుతీప్రసాద్, మాజీ సర్పంచ్ ముత్యాలు, పోతన్న, ఎంపీటీసీ శ్రీనివాసులు, ఆదిశేషు పాల్గొన్నారు.

రాష్ట్ర ఎన్నికల బీజేపీ ఎస్సీ ప్రముఖ్‌గా శాంతకుమార్

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 24: రాష్ట్ర ఎన్నికల బీజేపీ ఎస్సీ ప్రముఖ్‌గా తనను ఎంపిక చేసినట్లు మందల శాంతకుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడలో బీజేపీ రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి తనను ఈ మేరకు నియమించారన్నారు. ఈ సందర్భంగా పురందేశ్వరి, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు గుడిసె దేవానంద్, బీజేపీ ప్రధాన కార్యదర్శి వెంకటశివనారాయణ, జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులుకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు శాంతకుమార్ పేర్కొన్నారు.


శాంతకుమార్‌ను అభినందిస్తున్న పురందేశ్వరి

నేత్రపర్వం.. గుంటి సుబ్రహ్మణ్యేశ్వరుడి రథోత్సవం



గార్లదిన్నె, ఫిబ్రవరి 24: గుంటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి రథోత్సవం శనివారం రాత్రి నేత్రపర్వంగా సాగింది. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఉత్సవమూర్తిని వివిధ పుష్పాలతో ప్రత్యేక అలంకరించిన రథంపై కొలువుదీర్చి గ్రామ పురవీధుల గుండా మేళతాళాలతో ఊరేగించారు. భక్తులతో కోటంక పురవీధులు కిటికటలాడాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా శింగనమల సీఐ శ్రీధర్, గార్లదిన్నె ఎస్ఐ గౌస్‌బాషా బందోబస్తు నిర్వహించారు. ఆదివారం ఉదయం స్వామి వారి తిరునాళ జరుగుతున్నట్లు ఆ ఆలయ కార్యనిర్వహణాధికారి బాబు తెలిపారు.

పేదరికాన్ని పారదోలేవిధంగా ప్రణాళిక

పీసీసీ మాజీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 24: పేదరికాన్ని పారదోలేవిధంగా ప్రణాళిక రూపొందించడం జరిగిందని పీసీసీ మాజీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు పేర్కొన్నారు. ఈ ప్రణాళిక ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గె అధ్యక్షతన అమలుకు శ్రీకారం చుట్టడం జరుగుతుందన్నారు. శనివారం కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న సభకు ముఖ్య అతిథులుగా ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జునఖర్గెతోపాటు పీసీసీ అధ్యక్షురాలు షర్మిల, ఇతర నాయకులు హాజరుకానున్నారన్నారు. నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున సభకు హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్, మైనార్టీ అధ్యక్షుడు దాదాగాంధీ, నాయకులు రామానాయుడు, వాసు, శివశంకర్ యాదవ్, శర్మాస్, ఇమామ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గిడుగు రుద్రరాజు

విజయవంతం చేయండి: శైలజానాథ్

గార్లదిన్నె: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని పీసీసీ మాజీ అధ్యక్షుడు సాకే శైలజానాథ్ పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం మండల కేంద్రంలో పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోనిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఇంటి వద్ద విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభకు నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు బండ్లపల్లి ప్రతాప్‌రెడ్డి, కన్వీనర్ ఓబిరెడ్డి, మాజీ ఎంపీటీసీ పూలప్రసాద్, నాయకులు ఆదెన్న పాల్గొన్నారు.

'పనులను వేగవంతం చేయండి'

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 24: అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద ప్రధాని నరేంద్రమోడీ ఆన్‌లైన్ లింక్ ద్వారా ఈ నెల 26న శంకుస్థాపన చేయడం జరుగుతోందని, ఇందుకు సంబంధించి పనులను వేగవంతం చేయాలని రైల్వే డివిజనల్ ఇంజనీర్ మణికంఠ సిబ్బందికి సూచించారు. శనివారం రైల్వే స్టేషన్‌లోని స్టేషన్ మేనేజర్ చాంబర్‌లో సమావేశం నిర్వహించారు. శంకుస్థాపన అంశాలకు సంబంధించి ఎవరు ఏమి చేయాలన్నది దిశ నిర్దేశం చేశారు. సమావేశంలో ఐడీఎఫ్ రవిప్రకాష్, స్టేషన్ మేనేజర్ అశోక్‌కుమార్, హెల్త్ ఇన్‌స్పెక్టర్ శివశంకర్, ఐఓడబ్ల్యూ ఉమేష్, ఎస్ఎస్ఈ సిగ్నల్ గణేష్, రైల్వే ఇన్‌స్పెక్టర్ రవిప్రకాష్, ఎస్ఐ మధుకరణ్‌చారి పాల్గొన్నారు.

'అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు'

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 24: దుకాణాలల్లో తినుబండారాలను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని తూనికలు, కొలతల శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ సుధాకర్ అన్నారు. శనివారం ఆయన ఆశాఖ ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ గౌస్‌తో కలిసి ఆర్టీసీ బస్టాండులోని దుకాణాలను తనిఖీ చేశారు. ఎమ్మార్పీ కంటే అధిక ధరకు తినుబండారాలను విక్రయిస్తుండటంతో 6 కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. తనిఖీల్లో ఆ శాఖ టెక్నికల్ సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ శ్రేణుల సంబరాలు

తెలుగుదేశం పార్టీ అధిష్ఠానం ఎమ్మెల్యే అభ్యర్థులను ప్రకటించడంతో పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. రాయదుర్గంకు కాలవ శ్రీనివాసులు, ఉరవకొండ పయ్యావుల కేశవ్, తాడిపత్రికి జేసీ అశ్మిత్ రెడ్డి, కళ్యాణదుర్గం అమిలినేని సురేంద్రబాబును అధిష్ఠానం ప్రకటించింది. దీంతో వారి అభిమానులు, నాయకులు, కార్యకర్తలు బాణసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. - ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్


వజ్రకరూరులో మండల కన్వీనర్ వెంకటేష్, ఎర్రిస్వామి నాగన్న ఆధ్వర్యంలో సంబరాలు...


పుట్లూరులో కేక్ కట్ చేసి స్వీట్లు తినిపించుకుంటున్న గోవర్ధన్‌రాజు, వేణు, జయరామిరెడ్డి, రవీంద్రచౌదరి


కళ్యాణదుర్గంలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద సంబరాలు చేసుకుంటున్న అమిలినేని సురేంద్రబాబు వర్గీయులు


కణేకల్లులో ఎన్టీఆర్ జెండాకట్ట వద్ద పార్టీ నాయకులు లాలెప్ప, రమేష్, చంద్రశేఖర్ గుప్తా, కురుబ నాగరాజు తదితరుల సంబరాలు


యల్లనూరులో కేక్ తినిపించుకుంటున్న అచ్యుతాపురం జనార్దన్‌రెడ్డి, నరేంద్ర, యల్లనూరు సుబ్బరాయుడు, నారాయణస్వామి తదితరులు

వేర్వేరు ప్రమాదాల్లో 21 మందికి గాయాలు

ఆటో బోల్తాపడి పది మంది... ఎడ్లబండిని లారీ ఢీకొని ఐదుగురు..

కణేకల్లు, ఫిబ్రవరి 24: వేర్వేరు ప్రమాదాల్లో 21 మంది గాయపడ్డారు. కణేకల్లు మండలంలోని తుంబిగనూరు గ్రామం వద్ద శనివారం సాయంత్రం ఆటో బోల్తా పడిన సంఘటనలో పది మందికి గాయాలయ్యాయి. గంగలాపురం గ్రామానికి చెందిన దాదాపు 15 మంది కూలీలు ఒక ఆటోలో మిరప పంట కోసేందుకు బొమ్మనహాళ్ మండలంలోని వన్నళ్లికు వెళ్లి సాయంత్రం తిరిగి వస్తుండగా తుంబిగనూరు గ్రామ సమీపంలో ఆటో బ్రేకులు ఫెయిలై పొలాల్లో బోల్తా పడింది. ఈ సంఘటనలో యర్రక్క, భవాని, నాగేంద్ర, లక్ష్మీ, నాగమణి, రామాంజినమ్మ, గంగమ్మ, కొల్లమ్మ, రత్నమ్మ, గాయత్రిలకు గాయాలయ్యాయి. వీరిని కణేకల్లు ప్రభుత్వాస్పత్రిలో ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం మెరుగైన చికిత్స కోసం కళ్యాణదుర్గంకు తరలించారు.

పెద్దవడుగూరు: పెద్దవడుగూరు మండలంలోని కిష్టిపాడు గ్రామ సమీపం 67వ జాతీయ రహదారిలో శనివారం ఎడ్లబండిని లారీ ఢీకొన్న సంఘటనలో ఐదుగురు గాయపడినట్లు పోలీసులు తెలిపారు. యాడికి మండలంలోని పచ్చారుమేకలపల్లి గ్రామానికి చెందిన బాలరంగయ్యతోపాటు మరో నలుగురు ఎండ్లబండిలో తొండపాడు రంగనాథస్వామి తిరుణాలకు బయలుదేరారు. కిష్టిపాడు గ్రామసమీపంలోకి రాగానే వెనుక వైపు నుంచి లారీ ఢీకొనడంతో బాలరంగయ్యతోపాటు మరో నలుగురు గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

గుత్తి రూరల్: మండలంలోని యంగిలిబండ గ్రామాశివారులోని 67వ జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. గొందిపల్లి గ్రామానికి చెందిన విశాల్, గుంతకల్లు మండలం నాగసముద్రం గ్రామానికి కార్తీక్ ఇద్దరు ద్విచక్రవాహనంలో గుత్తికి వస్తుండగా యంగిలిబండ గ్రామశివారులోకి రాగానే ద్విచక్రవాహనం అదుపు తప్పి కింద పడడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం ఇద్దరిని అనంతపురానికి తరలించారు. ఈ సంఘటన పై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

ఒకరికి గాయాలు: మండలంలోని జక్కలచెరువు గ్రామాశివారులోని 67వ జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు గాయపడ్డారు. పెద్దవడుగూరు మండలం కదరగుట్టపల్లి గ్రామానికి చెందిన మనోహర్ తొండపాడులోని రంగనాథస్వామికి గ్రామం నుంచి నడుచుకుని వస్తుండగా జక్కలచెరువు గ్రామ సమీపంలోకి రాగానే గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో గాయపడ్డాడు. స్థానికులు గుర్తించి గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి తరలించారు. సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

పెద్దవడుగూరు: మండలంలోని వీరేపల్లి గ్రామ సమీపంలోని 67వ జాతీయరహదారి వద్ద శనివారం ఆటోబోల్తాపడిన సంఘటనలో యాడికి మండలం కేశవరాయునిపేట గ్రామానికి చెందిన గంగమ్మ, అరుణ, రాముడు గాయపడ్డారు. తొండపాడు రంగనాథస్వామి తిరుణాలకు వెళుతుండగా ప్రమాదవశాత్తు ఆటో బోల్తాపడడంతో ముగ్గురు గాయపడ్డారు. చికిత్స నిమిత్తం ముగ్గురిని ఆసుపత్రికి తరలించారు.

గడ్డివామి దగ్ధం

విడపనకల్లు, ఫిబ్రవరి 24: మండల కేంద్రంలోని ఆర్ కొట్టాల రోడ్డు వైపు ఉన్న రసూలమ్మ కాలనీలో ప్రమద వశాత్తు గడ్డివామికి నిప్పంటుకుని దగ్ధమైన సంఘటన శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే ఎర్రిస్వామి పశువుల కోసం రూ.2 లక్షలు ఖర్చు చేసి గడ్డిని కొనుగోలు చేశాడు. ఇంటి వద్దనే వామిని వేశాడు. దీనితో పాటుగా పాత వామిని కుడా పక్కనే వేసుకున్నాడు. ప్రమాద వశాత్తు గడ్డి వామికి నిప్పు పడటంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. ఉరవకొండకు చెందిన అగ్ని మాపక సిబ్బంది విడపనకల్లు గ్రామం చేరుకుని మంటలను అదుపు చేశారు. రూ.రెండు లక్షలకుపైగా నష్ట పోయినట్లు అధికారులు అంచనా వేశారు.

ట్రాక్టర్ నుంచి కిందపడి బాలుడి మృతి

యాడికి, ఫిబ్రవరి24: ట్రాక్టర్‌పై నుంచి కిందపడి యగ్నేష్ (7) అనే బాలుడు మృతిచెందిన సంఘటన శుక్రవారం రాత్రి యాడికి మండలం చందన గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలమేరకు చందన గ్రామానికి చెందిన రాజశేఖర్‌కు ఇద్దరు కుమారులు. మొదటి కుమారుడు యగ్నేష్ రెండవ తరగతి చదువుతున్నాడు. శనివారం తొండపాడులో తిరుణాల ఉండడంతో బంధువులు, గ్రామస్థులతో కలిసి వెళ్లడానికి ట్రాక్టర్‌కు అలంకరణ పనులు చేస్తున్నారు. ఆ సమయంలో యగ్నేష్ ట్రాక్టర్‌లో ఉన్నాడు. ట్రాక్టర్ సైడ్‌డోర్ తెరచుకోవడంతో బాలుడు కిందపడ్డాడు. ట్రాక్టర్ డోర్ బాలుడి తలకు బలంగా తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సంబరంగా తిరుణాలకు వెళుదామనుకున్న కుటుంబ సభ్యులు విషాదంలో మునిగారు. తండ్రి రాజశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


యగ్నేష్ (ఫైల్)

ఇంటిపై నుంచి పడి వ్యక్తి...

పుట్లూరు, ఫిబ్రవరి 24: మండలంలోని ఎల్లుట్ల గ్రామంలో రేపల్లె లక్ష్మీనారాయణ (43) అనే వ్యక్తి ఇంటి పైనుంచి ప డి మృతిచెందినట్లు శనివారం పోలీసు లు తెలిపారు. ఇం టిపైకి మెట్లు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి అక్క లక్ష్మీనారాయణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

యాడికి, ఫిబ్రవరి24: మద్యానికి బానిసైన మల్లికార్జున(27) అనే వ్యక్తి విషద్రావకం తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం యాడికిలోని రాఘవేంద్ర కాలనీలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు యాడికిలోని రాఘవేంద్రకాలనీకి చెందిన మల్లికార్జున ఆటోడ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మల్లికార్జునకు భార్య తులసి, ఇద్దరు కుమారులు ఉన్నారు. మల్లికార్జున మద్యానికి బానిసై ప్రతిరోజూ మద్యం తాగేవాడని తెలిపారు. కుటుంబసభ్యులు ఎంత మందలించినా మానలేదని తెలిపారు. కుటుంబ సభ్యుల మందలింపుతో మనస్థాపం చెందిన మల్లికార్జున విషద్రావకం తాగి ఆత్మహత్యాయ త్నం చేసినట్లు తెలిపారు. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మల్లికార్జున మృతిచెందినట్లు తెలిపారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జగన్‌తో అందరికీ నష్టమే: మాజీ ఎమ్మెల్యే


18వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న జితేంద్రగౌడు

గుంతకల్లు, ఫిబ్రవరి24: ఐదేళ్ల జగన్ పరిపాలనలో అన్ని వర్గాలూ తీవ్రంగా నష్టపోయాయని, ఇదే పరిస్థితులు కొనసాగితే ప్రజలు బతకడమే దుర్భరంగా మారుతుందని మాజీ శాసన సభ్యుడు జితేంద్రగౌడు అన్నారు. శనివారం ఉదయం పట్టణంలోని 18వ వార్డులో భవిష్యత్తుకు గ్యారెంటీ ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు. వార్డు మహిళలతో ఆయన మాట్లాడుతూ జగన్‌కు పరిపాలన చేతకాక మోయలేనన్ని అప్పులుచేసి రాష్ట్ర భవితవ్యాన్ని తాకట్టుపెట్టాడన్నారు. తెలంగాణ ఏర్పడినప్పుడు క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న ఆంధ్రప్రదేశ్‌ను చంద్రబాబు సమర్థవంతంగా నడిపారన్నారు. ఇప్పుడు కూడా ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న రాష్ట్రాన్ని గట్టెక్కించాలంటే చంద్రబాబు వల్లే సాధ్యమన్నారు. కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పవన్ కుమార్ గౌడు, నాయకులు అనిల్ కుమార్ గౌడు, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, తలారి మస్తానప్ప, తలారి సరోజమ్మ, టీ కేశప్ప, కౌన్సిలరు గుడిపాటి ఆంజనేయులు, హనుమంతు, పాల మల్లికార్జున, శివప్ప, రంజాన్, ఫజులు, గిడ్డయ్య, కేసీ రామాంజనేయులు, బండి లక్ష్మీదేవి, మాధవి, పద్మ, చంద్రయ్య, జగన్నాథ్, రామలింగారెడ్డి, శివ, మధు, సరేంద్ర, మహదేవ్, నాగరాజు, వెంకటేశ్ పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే ప్రజా సంక్షేమం

యాడికి: చంద్రబాబునాయుడుతోనే ప్రజా సంక్షేమ పాలన సాధ్యమని నియోజకవర్గ ఇన్‌చార్జి జేసీ అశ్మిత్‌రెడ్డి అన్నారు. యాడికిలోని టీచర్స్‌కాలనీ, శాంతినగర్‌లో శనివారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్ర అభివృద్ధి అటకెక్కిందన్నారు. అభివృద్ధి పనులు జరగక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్రం బాగుపడాలంటే టీడీపీ అధికారంలోకి రావాల్సిందేనని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పరిమి చరణ్, మాజీ ఎంపీటీసీ ఆదినారాయణ, తిరంపురం నీలకంఠ, రామచంద్రారెడ్డి, మాదాల అనిల్, బొట్టు శేఖర్, మధురాజు, నారాయణస్వామి, చంద్రశేఖర్‌రెడ్డి, రామాంజనేయులు, నరసింహచౌదరి, హరి, రాఘవ పాల్గొన్నారు.


యాడికి టీచర్స్ కాలనీలో పర్యటిస్తున్న జేసీ అశ్మిత్ రెడ్డి

అంగరంగ వైభవంగా లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం

రాయదుర్గంరూరల్, ఫిబ్రవరి 24: మండల పరిధిలోని మల్లాపురం గ్రామంలో వెలసిన విప్రమలై లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మరథోత్సవం శనివారం అంగరంగ వైభవంగా సాగింది. స్వామివారి 28వ బ్రహ్మరథోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారికి గౌరవ అధ్యక్షుడు రామ్మూర్తి స్వామీజీ ఆధ్వర్యంలో స్వామివారికి నిత్య కైంకర్యములు, రథాంగ హోమం, 11 గంటలకు మడుగుతేరు నిర్వహించారు. మెట్టు గోవిందరెడ్డి దంపతులు పాల్గొనగా అనంతరం అశేష భక్తజనుల మధ్య మేళతాళాలతో వేదమంత్రోచ్ఛారణలతో జరిగిన బ్రహ్మరథోత్సవంలో మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు బీటీ తిప్పేస్వామి ఉపాధ్యక్షులు ధర్మన్న, కోశాధికారి జీఎన్ నరసింహులు, ఉప కోశాధికారి, ఎస్ఆర్ఎస్ సత్యనారాయణ, కార్యదర్శి గురు రాఘవేంద్ర పాల్గొన్నారు.


అశేష భక్తజనం మధ్య లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం

పట్టాభిరామస్వామి..


పట్టాభి రామస్వామి రథాన్ని లాగుతున్న భక్తులు

కళ్యాణదుర్గంరూరల్, ఫిబ్రవరి 24: పట్టణంలోని పట్టాభిరామ స్వామి ఆలయంలో స్వామివారి రథోత్సవం కన్నుపండువగా సాగింది. శనివారం అశేష భక్తుల మధ్య రథాన్ని లాగి భక్తులు మొక్కుబడులను తీర్చుకున్నారు. కోటవీధి నుంచి గాంధీ చౌక్ వరకు రథాన్ని ఊరేగించారు. పట్టాభి రామస్వామి రథంపై భక్తులు అరటిపళ్లను విసిరి సంప్రదాయంగా స్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

ఆంజనేయస్వామి...

కుందుర్పి, ఫిబ్రవరి 24: బబ్బుళ్లకుంట ఆంజనేయస్వామి రథోత్సవం శనివారం వైభవంగా సాగింది. బబ్బుళ్ల కుంట ఆంజనేయ స్వామి ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. రథాన్ని రంగు రంగు పూలతో అలంకరించారు. వేలాది మంది భక్తులు స్వామివారికి పూలహారాలను మొక్కుబడులుగా సమర్పించారు. మాఘమాస పౌర్ణమి రోజున ఈ రథోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. రథోత్సవానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు తరలివ్చారు. రాత్రి 12 గంటలకు రథోత్సవం నిర్వహిస్తారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తుల సౌకర్యార్థం అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేశారు.


ఊరేగింపునకు సిద్ధమైన రథం

బూదిగుమ్మ హనుమంతరాయస్వామి...

బెళుగుప్ప, ఫిబ్రవరి 24: మండలంలోని బూదిగుమ్మ తిరునాళ్లలో భాగంగా హనుమంత రాయ స్వామి రథోత్సవం శనివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. బూదిగుమ్మ హనుమాన్ నామస్మరణలతో మారుమోగింది. జడ్పీటీసీ కే మమత, సర్పంచ్ రామకృష్ణమ్మ, కార్యనిర్వహణాధికారి శోభ, పూజలు చేసి ప్రారంభించారు. ఎస్ఐ శివ తమ సిబ్బందితో బందోబస్తు పర్యవేక్షించారు.


రథాన్ని లాగుతున్న భక్తులు

ఘనంగా పాండురంగడి కల్యాణోత్సవం

బెళుగుప్ప, ఫిబ్రవరి 24: మండలంలోని శ్రీరంగాపురంలో శ్రీదేవి, భూదేవి సమేత పాండురంగస్వామి కల్యాణోత్సవాన్ని శనివారం కన్నుల పండువగా నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను రథంపై భజనకీర్తనలతో ఊరేగించారు. సర్పంచ్ సాహితిరెడ్డి, వేదపండితులు శంకరప్ప శర్మ పాల్గొన్నారు.


శ్రీదేవి భూదేవి సమేత పాండురంగస్వామి

మాజీ సర్పంచ్ గురుసిద్దప్ప టీడీపీలో చేరిక


కాలవ శ్రీనివాసులు ఆధ్వర్యంలో టీడీపీలో చేరిన గురుసిద్దప్ప

రాయదుర్గంరూరల్, ఫిబ్రవరి 24: మం డలంలోని ఉడేగోళం గ్రామ పంచాయతీకి చెం దిన మాజీ సర్పంచ్ గు రుసిద్దప్ప, వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలోకి శనివారం చేరారు. మా జీ మంత్రి కాలవ శ్రీనివాసులు నివాసంలో పార్టీ కండువా వేసి ఘనంగా ఆహ్వానించారు. గురుసిద్దప్పతో పాటు విజయేంద్ర, మరికొంతమంది పార్టీలోకి చేరారు. టీడీపీ మండల కన్వీనర్ హనుమంతు, మాజీ జెడ్పీటీసీ విజయకుమార్, టీడీపీ నాయకులు తిప్పేస్వామి, శ్రీకంఠప్ప, ఓబయ్య, జనార్దన్ రెడ్డి పాల్గొన్నారు.

ఉరవకొండ: వజ్రకరూరు మండలంలోని పందికుంట గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు టీడీపీలోకి చేరారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం టీడీపీ నాయకులు పయ్యావుల శ్రీనివాసులు సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వైసీపీకి చెందిన వెంకటేశులు, అంజి, నాగరాజు, వన్నూరుస్వామి, రాజు, రమేష్‌లకు పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. వీరితో పాటు 40 కుటుంబాలు పార్టీలోకి చేరారు. మండల కన్వీనర్ నూతేటి వెంకటేశులు, నాయకులు నాగేంద్ర, మండి ఎర్రిస్వామి, ధనంజయ, రామకృష్ణ, వెంకటేశులు పాల్గొన్నారు. అలాగే నింబగల్లుకు చెందిన 30 వైసీపీ కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం పయ్యావుల శ్రీనివాసుల సమక్షంలో పార్టీలోకి చేరారు. వీరన్న ఓబులేసు, వన్నూరుస్వామి, కావలి తిమ్మరాజు, దాసరి రమేష్‌లతో పాటు మరికొంత మందికి పార్టీ కండువాలు వేసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సిద్దప్ప, భగవాన్, నూతన్ పాల్గొన్నారు.


పయ్యావుల శ్రీనివాసులు ఆధ్వర్యంలో టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు

కబడ్డీలో సాయిచైతన్య విద్యార్థుల ప్రతిభ

తాడిపత్రి టౌన్, ఫిబ్రవరి 24: సత్తెనపల్లిలో ఈనెల 21నుంచి 23వరకు జరిగిన 33వ సబ్ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీల్లో శ్రీసాయి చైతన్య స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపారని కరస్పాండెంట్ లక్ష్మీనరసింహ తెలిపారు. బాలికల విభాగంలో ముగ్గురు, బాలుర విభాగంలో ఒకరు సత్తా చాటారన్నారు. వీరిలో గౌతమి అత్యంత ప్రతిభ చూపి జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఎంపికైన వారిని రూరల్ సీఐ లక్ష్మీకాంత్‌రెడ్డి, ఎంఈఓ నాగరాజు అభినందించారు.


విద్యార్థులను అభినందిస్తున్న సీఐ, ఎంఈఓ

వైభవంగా వన్నూరుస్వామి ఉరుసు

విడపనకల్లు, ఫిబ్రవరి 24: మండలంలోని మాళాపురం గ్రామంలో వన్నూరుస్వామి ఉరుసు శనివారం వైభవంగా నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం స్వామివారికి గంధన్ని వీదుల్లో ఊరేగించి దర్గాకు చేరుకున్నారు. శనివారం ఉదయాన్నే స్వామి వారి సమాధికి ప్రార్థనలు చేశారు. భక్తులు స్వామి వారికి చాదర్లు సమర్పించారు. చక్కెరను తూకాలు చేయించి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు. ఆదివారం ఉదయం షంషేర్ ఊరేగింపుతో ఉరుసు ఉత్సవాలు ముగుస్తాయి.

ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు

ఉరవకొండ, ఫిబ్రవరి 24: మండలంలోని బూదగవి గ్రామంలో శనివారం సూర్యనారాయణస్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని లెక్కించారు. పర్యవేక్షకులు పెన్నహోబిలం ఈవో విజయ్‌కుమార్, సీఐ తిమ్మయ్య సమక్షంలో లెక్కింపు చేపట్టారు. 14 నెలలకు సంబంధించి రూ.1,54,000 ఆదాయం వచ్చిందన్నారు. గ్రూప్ దేవాలయాల అధికారి కృష్ణయ్య, వీఆర్వో కృష్ణకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా పాఠశాలలు నిర్వహిస్తే చర్యలు

యాడికి, ఫిబ్రవరి 24: ప్రభుత్వ అనుమతులు లేకుండా ప్రైవేట్ పాఠశాలలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎంఈఓ కాశప్ప హెచ్చరించారు. శనివారం మండలంలోని సాగర్ సిమెంట్ ఫ్యాక్టరీలో నిర్వహిస్తున్న ప్రైవేట్ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. పాఠశాలకు ప్రభుత్వ అనుమతులపై ఆరాతీశారు. వారు అనుమతి లేదని తెలపడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయుడు శివరామిరెడ్డి, సీఆర్పీలు బాబు, ఓబులేసు ఉన్నారు.

రేపు సీనియర్ కబడ్డీ జట్టు ఎంపిక

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 24: పట్టణంలోని రాజేంద్రప్రసాద్ మున్సిపల్ పాఠశాలలో సోమవారం ఉమ్మడి అనంతపురం జిల్లా సీనియర్ కబడ్డీ జట్టు ఎంపిక చేయనున్నట్లు కబడ్డీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి లక్ష్మణ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలో పాల్గొనే క్రీడాకారుల పురుషుల బరువు 85కేజీలు ఉండాలన్నారు. ఎంపికైన కబడ్డీ జట్టు మార్చి 3 నుంచి 5 వరకు విశాఖలో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటారన్నారు. క్రీడాకారులు తమ వెంట ఆధార్ కార్డు తీసుకొని రావాలన్నారు. మరిన్ని వివరాలకు 9441053041, 9966224669 నెంబర్లను సంప్రదించాలన్నారు.

వైద్య సేవలపై ఆరా

కూడేరు, ఫిబ్రవరి 24: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, సబ్‌సెంటర్ల నిర్వహణ, వైద్యసిబ్బంది పనితీరుపై కేంద్ర హెల్త్ క్వాలిటీ కంట్రోల్ టీమ్ సభ్యులు ఆరా తీశారు. శనివారం కూడేరు మండలం గొట్కూరు హెల్త్ సబ్ సెంటర్‌ను బృందం సభ్యులు మురుగేషన్, సునీత, శ్వేతన్ తనిఖీ చేశారు. సెంటర్‌లో ఏఎన్ఎం, ఆశా, ఎంఎల్‌హెచ్‌పీలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

ఘనంగా ఫేర్‌వెల్ డే

తాడిపత్రిటౌన్, ఫిబ్రవరి 24: పట్టణ సమీపంలో ఉన్న టెక్ జూనియర్ కళాశాలలో శనివారం ఫేర్‌వేల్‌డేను ఘనంగా నిర్వహించారు. వేడుకలకు ముఖ్యఅతిథులుగా టెక్ విద్యాసంస్థల సెక్రటరీ సురేష్‌రెడ్డి, కరస్పాండెంట్ అశోక్‌కుమార్‌రెడ్డి హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ఏపని చేసినా బాధ్యతతో చేస్తే మంచి ఫలితం ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ ఉన్నత విద్యను అభ్యసించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ ప్రత్యూష, అధ్యాపకులు పాల్గొన్నారు.

చంద్రబాబు ఫ్లెక్సీలు చించివేత

కళ్యాణదుర్గం, ఫిబ్రవరి 24: టీడీపీ అభ్యర్థిగా అమిలినేని సురేంద్రబాబు పేరు ఖరారు కావడంతో ఉన్నం హనుమంతరాయచౌదరి వర్గీయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నం క్యాంపు కార్యాలయం వద్ద ఉన్న చంద్రబాబు ఫ్లెక్సీలను తొలగించారు. పార్టీ కోసం నలభై ఏళ్లుగా ఉన్నం శ్రమించారని, నియోజకవర్గంలో అభివృద్ధికి బాటలు వేశారని ఆయన వర్గీయులు అన్నారు. నియోజకవర్గాన్ని టీడీపీ కంచుకోటగా మార్చడంలో హనుమంతరాయచౌదరి పాత్ర ఎంతో ఉందని అన్నారు. ఆయనకు కాకుండా ఇతరులకు టిక్కెట్ ఇవ్వడం సరికాదని అన్నారు.

ఉచిత కుట్టుశిక్షణను వినియోగించుకోండి

పెద్దపప్పూరు, ఫిబ్రవ రి 24: ఉచిత కుట్టుశిక్షణా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ నాయ కుడు చవ్వా గోపాల్‌రెడ్డి కో రారు. శనివారం చవ్వా ఆదినారాయణరెడ్డి ట్రస్ట్ ఆధ్వ ర్యంలో మండలంలోని చీ మలవాగుపల్లి, నరసాపురం గ్రామాల్లో రెండు ఉచిత కుట్టుశిక్షణా కేంద్రాలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సత్యనారాయణరెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చవ్వా గోపాల్‌రెడ్డి

స్కేటింగ్ క్రీడాకారులకు సన్మానం


క్రీడాకారులను సన్మానిస్తున్న దృశ్యం

తాడిపత్రి టౌన్, ఫిబ్రవరి 24: నిరవధికంగా 750 కి.మీ. 36గంటల్లో పూర్తి చేసిన స్కేటింగ్ క్రీడాకారులకు శనివారం వాసవీక్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించారు. మండలంలోని ఆవులతిప్పాయపల్లి గ్రామసమీపంలో ఉన్న శ్రీ రమణ మహర్షి అనాధ బాలుర పాఠశాలలో చదువుతున్న ఏడుగురు స్కేటింగ్ క్రీడాకారులు ఇటీవల 750కిలోమీటర్లు 36గంటల్లో పూర్తిచేసి గిన్నిస్ బుక్‌ఆఫ్ వరల్డ్‌రికార్డు సాధించారు. దీంతో ఆశ్రమ నిర్వాహకులు మహేష్, కోచ్ మధులను సత్కరించారు. అనంతరం క్రీడాకారులకు కొత్త డ్రెస్సులు, బూట్లు, మెమెంటోలను అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు నాగేంద్రగుప్త, సభ్యులు రామకృష్ణప్రసాద్, సాయితరుణ్ పాల్గొన్నారు.

జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టం చేయాలి


అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న దళిత సంఘాల నాయకులు

గుంతకల్లు టౌన్, ఫిబ్రవరి 24: జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టం చేయాలని దళిత ఐక్య వేదిక, ప్రజా సం ఘాల నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపల్ కా ర్యాలయం సమీపంలోని అం బేడ్కర్ విగ్రహం వద్ద శనివారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ రాప్తాడు సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి సిగ్గుమాలిన చర్య అన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలాల ఉండే జర్నలిస్టులపై దాడులు దుర్మార్గమన్నారు. ఎల్లిపాయల ఆనంద్, జగ్గలి రమేష్, వై శ్రీనివాసులు, భారతి, వెంకటేష్, సుంకన్న, నరసింహులు, వేణు, ఆనంద్, రామాంజి, మస్తాన్, చిన్ని, రాజు, రమేష్ పాల్గొన్నారు.